Visakha
Samacharam
MINI
FUNCTION HALL
@100P/5K
99487 49799

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారం

Site For Sale
4000 Sq. Yards
Site with mango tope in Madhurawada I.T.SEZ is for sale. East side 80 feet Road & West side 40 feet Road.
Cell : 8247526179

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 76 విశాఖపట్నం, 28 డిశంబరు 2023 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

### పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన

## వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్



విశాఖకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వంశీకృష్ణ యాదవ్‌కు పవన్ కల్యాణ్ జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు.

ఈ సందర్భంగా వంశీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ జనసేన పార్టీలోకి రావడంతో నాకు పార్టీ మారినట్టుగా అనిపించడం లేదు. సొంత ఇంటికి వచ్చినట్టుగా అనిపిస్తోంది అని వ్యాఖ్యానించారు. గతంలో నేను పవన్ అన్న ఆధ్వర్యంలో ప్రజారాజ్యం యువజన విభాగంలో పనిచేశాను. ఇప్పుడు మళ్లీ అన్న నేతృత్వంలో పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది అని వెల్లడించారు.

తాను ఏ పార్టీలో ఉన్నప్పటికీ పవన్ కల్యాణ్ అభిమానిగానే ఉన్నానని, ఇప్పటికీ పవన్ కల్యాణ్ సినిమా విడుదలైతే మొదటి రోజే సినిమా చూస్తానని వెల్లడించారు.

ఉత్తరాంధ్రలో, విశాఖలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు, పవన్ కల్యాణ్‌ను సీఎంగా చేసేందుకు సర్వ శక్తులు ధారపోస్తాను అని తెలిపారు. విశాఖ ప్రజలందరూ నా నిర్ణయాన్ని స్వాగతిస్తారని నమ్ముతున్నాను అని వివరించారు.

ఇక, వంశీకృష్ణ యాదవ్ జనసేనలోకి రావడం పట్ల పవన్ కల్యాణ్ స్పందించారు. వంశీకృష్ణ యాదవ్

(మిగతా 2లో)

## లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు సేవలందించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు ప్రజలకు సేవలందించాలని, రుణ మంజూరు ప్రక్రియలో సులభతర విధానాలు అమలు చేయాలని బ్యాంకర్లను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున పేర్కొన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించా లన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, ఇళ్ల నిర్మాణాలకు రుణ మంజూరు ప్రక్రియ, సిబిల్ స్కోర్ విధానం, కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణీ, స్త్రీనిధి రుణ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షిం చారు. పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పాలసీ విధానాలకు అనుగుణంగా బ్యాంకర్లు వ్యవహరించాలని, ప్రజలకు సులభతర రీతిలో సేవలందించాలని పేర్కొన్నారు. ప్రధానంగా స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునే వారికి, జగనన్న పేదలందరికీ ఇళ్లు, టిడ్కో పథకంలో భాగంగా నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. టిడ్కో లబ్ధిదారులకు రుణం మంజూరు చేసే క్రమంలో సిబిల్ స్కోర్ ఉండాలనే నిబంధనలో వీలును బట్టి సడలింపు ఇవ్వాలని చెప్పారు. కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న వారికి అన్ని విధాలా సహకరిస్తూ రుణాలను మంజూరు

(మిగతా 2లో)

## దేశంలో భారీగా పెరిగిన కరోనా కొత్త కేసులు: 109కి జేఎన్.1 వేరియంట్ కేసులు



**న్యూఢిల్లీ:** దేశంలో కరోనా వైరస్ పెడుతోంది. కోవిడ్ సాధారణ మహమ్మారి మరోసారి కలవర కేసులతోపాటు కొత్త వేరియంట్ కేసులు కూడా క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో కొత్తగా 529 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్యశాఖ బుధవారం వెల్లడించింది. దీంతో దేశంలో కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 4093కు చేరుకున్నట్లు పేర్కొంది. మరోవైపు, కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 వైరస్ కేసులు 101కి పెరిగాయి.

కాగా, గత 24 గంటల వ్యవధిలో కరోనా బారినపడి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఇద్దరు కర్ణాటక రాష్ట్రానికి చెందినవారు కాగా, ఒకరు గుజరాత్ రాష్ట్రానికి చెందినవారని అధికారులు తెలిపారు. కాగా, డిసెంబర్ 26 వరకు దేశంలో మొత్తం 109 కొవిడ్ ఉపరకం జేఎన్.1 కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. వీటిలో గుజరాత్ నుంచి 36, కర్ణాటక- 34, గోవా- 14, మహారాష్ట్ర- 9, కేరళ- 6, రాజస్థాన్- 4, తమిళనాడు- 4, తెలంగాణ నుంచి 2 కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది.

మరోవైపు

(మిగతా 2లో)

### అప్పుడు చంద్రన్న... ఇప్పుడు జగనన్న...

## కేంద్ర పథకాలకు రాష్ట్ర స్టిక్కర్లు వేసుకుంటున్నారు



కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకుంటోందని ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరించిందని, అప్పుడు చంద్రన్న స్టిక్కర్లు వేసుకున్నారని, ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం కూడా జగనన్న స్టిక్కర్లు వేసుకుంటోందని విమర్శించారు. అందుకే, కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రధాని పేరు, ఫొటో పెట్టకపోతే నిధులు నిలిపివేస్తామని కేంద్రం ప్రకటించిందని పురందేశ్వరి వెల్లడించారు. ఆయా పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. అయితే ప్రజల్లో దీనిపై అవగాహన పెరిగిందని తెలిపారు.

## నేషనల్ హైవే రోడ్డు మరమ్మతులు చేపట్టండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జివిఎంసి పరిధిలో పీఎం పాలెం నుండి షీలానగర్ వరకు నేషనల్ హైవే రోడ్డు మరమ్మత్తుల పనులతో పాటు, పలు చోట్ల బిటి రోడ్లులను వేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ఇంజినీరింగు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పీఎం పాలెం నుండి షీలానగర్ వరకు నేషనల్ హైవే రోడ్డును జివిఎంసి ప్రధాన ఇంజనీరు రవికృష్ణ రాజు, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్ తో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెంకోజిపాలెం నుండి డైరీ ఫారం వరకు నేషనల్ హైవే రోడ్డు మరమ్మతులకు గురైనందున ఒక పొర తారు రోడ్డును వెంటనే వేసే చర్యలు చేపట్టాలని జివిఎంసి ప్రధాన ఇంజనీర్‌ను ఆదేశించారు. పీఎం పాలెం నుండి షీలా నగర్ వరకు నేషనల్ హైవే రోడ్డు మరమ్మతులతో పాటు ఒక పొర తారు రోడ్డు వేసేందుకు, అలాగే హనుమంతు వాక జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మించేందుకు నేషనల్ హైవే అధికారుల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నేషనల్ హైవేలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు

(మిగతా 2లో)

## మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పోలీసుశాఖ తీసుకున్న చర్యల ఫలితంగా దాదాపు రెండేళ్లుగా కేసులు తగ్గుతూ వస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా॥ ఎ. మల్లిఖార్జున పేర్కొన్నారు. పోలీస్ శాఖ, నగర పోలీస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వార్షిక నేర సమీక్ష సమావేశం బుధవారం ఉదయం ఏయూ కన్వెన్షన్ సెంటరులో జరిగింది. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా॥ ఎ. మల్లిఖార్జునతో పాటు నగర పోలీస్ కమిషనర్ డా॥ ఎ. రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ, డీసీపీలు పి. వెంకట రత్నం, కె. ఆనంద్ రెడ్డి, కె. శ్రీనివాసరావు, రెవిన్యూ, జ్యుడీషియల్, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీ సభ్యుల సూచనల మేరకు పోలీసు శాఖ తీసుకున్న చర్యల వలన మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడంలో, నివారించడంలో ప్రజలు, కళాశాల విద్యార్థుల్లో కూడా అవగాహన పెరిగినట్లు చెప్పారు. వి.ఎం.ఆర్.డి.ఏ, జి.వి.ఎం.సి., పోలీసు శాఖల సహకారంతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రమాదాల సంఖ్య కూడా తగ్గినట్లు కలెక్టర్ తెలిపారు. దీనికి పోలీసు, ఇతర శాఖల సహకారం కూడా ఉందన్నారు.

నగర పోలీస్ కమిషనర్ డా॥ఎ. రవిశంకర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రావ్యల అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి నిఘాతో పాటు పటిష్ట చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నగర పోలీసు అధికారులు మరింత సమర్థవంతంగా పోలీసింగ్ చేయడానికి అవసరమైన విధానాల గురించి

(మిగతా 2లో)

## ఆ పనికి అక్షరాలా అరవై వేలు

- కార్యాలయం దగ్గర వద్దట
- అందుకే అక్కడ
- విద్యుత్ అధికారి నిర్వాకం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖలో ఓ అధికారి వినియోగదారుడి అవసరాన్ని ఆసరాగా చేసుకున్నాడు. విద్యుత్ మీటర్ల కోసమని వెళ్తే, వినియోగదారుడిని విసిగించాడు. కొద్ది రోజులు చుట్టూ తిప్పుకున్నాడు. చివరకు అసలు విషయాన్ని మెల్లగా చెప్పాడు. పని చేయాలంటే కాస్త తన వైపు చూడాలని చెప్పుకొచ్చాడు. ససేమిరా అంటే పని పెండింగ్ అయిపోతుందని పరోక్షంగా హెచ్చరిస్తూ స్పాట్ ఫిక్స్ చేసి అక్కడకు వచ్చేయమన్నాడు.

విశాఖలోని అక్కయ్యపాలెంకు చెందిన నరవ సూర్య ప్రకాష్, అతని ముగ్గురు సోదరులకు చెందిన నాలుగు ఇళ్ల ప్లాట్లకు సంబంధించి ఎలక్ట్రికల్ మీటర్ల కోసం విద్యుత్ ఆఫీస్‌కి వెళ్లారు. మీటర్ల జారీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తనిఖీలకు వెళ్లిన APEPDCL దొండపర్తి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ అక్కడ ట్రాన్స్ఫార్మర్ కూడా వేసుకోవాలని సూచించాడు. సరే అని వినియోగదారులు చెప్పేసరికి, మీటర్లు మంజూరు చేయాలంటే చేయి తడపాలని అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ సంకేతాలు ఇచ్చాడు. కష్టమర్ల అవసరాన్ని ఆసరాగా చేసుకొని 80వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు

(మిగతా 2లో)

## భారతదేశం, ఇటలీ మధ్య మైగ్రేషన్ అండ్ మొబిలిటీ ఒప్పందాన్ని ఆమోదించిన క్యాబినెట్



**విజయవాడ, (పీఐబీ):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం రిపబ్లిక్ ఆఫ్ ఇండియా మరియు ఇటాలియన్ రిపబ్లిక్ ప్రభుత్వాల మధ్య మైగ్రేషన్ అండ్ మొబిలిటీ అగ్రిమెంట్‌పై విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతిపాదనకు ఎక్స్-పోస్ట్ ఫ్యాక్టో ఆమోదం తెలిపింది.


ఈ ఒప్పందం ఇరు దేశాల ప్రజల మధ్య పరిచయాలను మెరుగుపరుస్తుంది. విద్యార్థులు, నైపుణ్యం కలిగిన కార్మికులు, వ్యాపారులు మరియు యువ నిపుణుల చైతన్యాన్ని పెంపొందిస్తుంది. అలాగే ఇరుపక్షాల మధ్య అక్రమ వలసలకు సంబంధించిన సమస్యలపై సహకారాన్ని బలోపేతం చేస్తుంది.

ప్రస్తుత ఇటాలియన్ వీసా పాలనలో ఈ ఒప్పందం లాక్-ఇన్ పోస్ట్ స్టడీ అవకాశాలు, ఇంటర్న్‌షిప్‌లు, ఫ్లోస్ డిక్రీ ప్రకారం ప్రస్తుతం ఉన్న లేబర్ మొబిలిటీ పాత్‌వేల క్రింద భారతదేశానికి ప్రయోజనాన్ని అందించే వృత్తిపరమైన శిక్షణల కోసం మెకానిజమ్‌లు ఉన్నాయి.

ఇటలీలో అకడమిక్/వృత్తి శిక్షణను పూర్తి చేసిన తర్వాత ప్రారంభ వృత్తిపరమైన అనుభవాన్ని పొందాలనుకునే భారతీయ విద్యార్థులు 12 నెలల వరకు ఇటలీలో తాత్కాలిక నివాసాన్ని మంజూరు చేయవచ్చు. ఇటాలియన్ వైపు ప్రొఫెషనల్ ట్రైనింగ్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఇంటర్న్‌షిప్‌లు మరియు కరిక్యులర్ ఇంటర్న్‌షిప్‌లకు సంబంధించిన వివరణాత్మక నిబంధనలు ఉన్నాయి. ఇవి భారతీయ విద్యార్థులు/ట్రైనీలు ఇటాలియన్ నైపుణ్యం/శిక్షణ ప్రమాణాలలో అనుభవాన్ని పొందేందుకు వీలు కల్పిస్తాయి.

కార్మికులకు ఇటాలియన్ వైపు ప్రస్తుత ఫ్లోస్ డిక్రీ ప్రకారం 2023, 2024 మరియు 2025 కోసం 5000, 6000 మరియు 7000 నాన్ సీజనల్ ఇండియన్ వర్కర్ల కోటాను రిజర్వ్ చేసింది (సీజనల్ కాని కార్మికులకు

(మిగతా 2లో)



## (మొదటి పేజీ తరువాయిలు)

### పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్

చాలా బలమైన నాయకుడు అని కొనియాడారు. వంశీకృష్ణ యాదవ్ తనకు ఎప్పటి నుంచో తెలిసిన వ్యక్తి అని, గతంలో యువరాజ్యంలో కలిసి పనిచేశామని చెప్పారు.

స్వల్ప తేడాతో విశాఖ తూర్పు నుంచి ఓడిపోయి, మళ్లీ ఎమ్మెల్సీగా గెలిచారని వివరించారు. ఇప్పుడాయనకు సొంత కుటుంబంలోకి స్వాగతం పలుకుతున్నాను అంటూ పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గతంలో యువరాజ్యంలో పనిచేసిన చాలామంది యువనేతలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో బలమైన నాయకులుగా ఉండడం చూస్తుంటే ఆనందంగా ఉందని అన్నారు.

### లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు సేవలందించాలి

చేయాలన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ. సెక్టార్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారికి సహకరించాలని చెప్పారు. అలాగే బ్యాంకర్లకు ప్రభుత్వ అధికారులు కూడా అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. సమన్వయంతో వ్యవహరించి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

సమావేశంలో భాగంగా నాబార్డు రూపొందించిన పొటెన్షియల్ లింక్డు క్రెడిట్ ప్లాన్ బుక్కు కలెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

సమీక్షా సమావేశంలో ఎల్.డి.ఎం. శ్రీనివాసు, ఆర్.బి.ఐ. ప్రతినిధి పూర్ణిమ, నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మనేజర్ సమంత్ కుమార్, వివిధ ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### దేశంలో భారీగా పెరిగిన కరోనా కొత్త కేసులు: 109కి జేఎన్.1 వేరియంట్ కేసులు

కరోనా మహమ్మారి నుంచి కోలుకున్న వారి సంఖ్య 4.4 కోట్లకు పెరిగింది. జాతీయ రికవరీ రేటు 98.81 శాతం, మరణాల రేటు 1.19 శాతంగా ఉంది. దేశంలో ఇప్పటివరకు 220.67 కోట్ల కొవిడ్ వ్యాక్సిన్‌లు పంపిణీ చేసినట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. కాగా, కరోనా కేసులతోపాటు మరణాలు పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. కరోనా పరీక్షలు పెంచాలని, బాధితులకు అవసరమైన చికిత్సను అందించాలని సూచించింది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది.

ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. కరోనాకు సంబంధించి ఇప్పటికే పలు కీలక మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. ప్రతి ఒక్కరూ మాస్క్ తప్పనిసరిగా ధరించాలని సూచించింది. బయటకు వచ్చినప్పుడు విధిగా మాస్క్ వేసుకోవాలని కోరింది. ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు పాటించడం, పరిశుభ్రత విషయంలోనూ పలు జాగ్రత్తలు తీసుకుంటూ పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవడం వంటివి చేయాలని సిఫార్సు చేసింది. పలు రాష్ట్రాలు కూడా మాస్కులను తప్పనసరి చేస్తున్నాయి.

### నేషనల్ హైవే రోడ్డు మరమ్మతులు చేపట్టండి

చర్యలు చేపట్టడంతో పాటు మొక్కల సంరక్షణ కొరకు గ్రీన్ బెల్ట్ ప్రదేశాలలో అవసరమైన చోట చైన్ లింక్డు మెష్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే గ్రీన్ బెల్ట్ మరియు సెంట్రల్ మీడియన్‌లలో ఆకర్షణీమైన మొక్కలతో అందంగా తీర్చిదిద్దాలని, గ్రీన్ బెల్ట్ ఏరియాలోను, సెంట్రల్ మీడియన్‌లలో అనధికార హోర్డింగులను, పెక్సీలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో జివిఎంసి పర్యవేక్షక ఇంజనీరు శ్యాంసన్ రాజు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరావు, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, ఆర్జీవి కృష్ణ, కార్యనిర్వహక ఇంజనీర్లు శాంతిరాజు, తారా ప్రసన్న, మత్స్యరాజు, ఉపకార్య నిర్వహణ ఇంజనీరు వంశీ తదితరులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు

పేర్కొన్నారు. తమ శాఖ నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, ఈ ఏడాది కాలంలో నగరంలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ లపై ఆయా అధికారులతో విశ్లేషించిన ఆయన ఉత్తమ పోలీసింగ్ కోసం రాబోవు సంవత్సరంలో తీసుకోవలసిన చర్యలను వివరించారు.

సమావేశంలో ఎస్.ఇ.బి అడిషనల్ ఎస్.పి బి.శ్రీనివాసరావు, ఉప రవాణా కమీషనర్ జి.సి.రాజ రత్నం, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, ఎన్.హెచ్.ఎ.ఐ. ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాత్ రంజన్, డీఈవో కె. చంద్రకళ, సమగ్రశిక్ష ఏ.పి.సి శ్రీనివాసరావు, నగర ఏ.డి.సి.పిలు, ఏ.సి.పిలు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఆ పనికి అక్షరాలా అరవై వేలు

ఏఈ సురేష్ కుమార్.

**అలా చిక్కాడు**

లంచం ఇవ్వడం ఇష్టం లేకపోవడంతో బాదితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు కాపు కాశారు. ఆఫీస్ దగ్గరైతే అందరికి తెలిసిపోతుందనుకునో లేక మరే అనుమానం వచ్చిందో ఏమోగానీ రైల్వే DRM ఆఫీస్ ప్రవేశ ద్వారం దగ్గర ప్లేస్ సెట్ చేసుకున్నాడు ఏఈ సురేష్ కుమార్. ప్లేస్ విసిట్ పేరుతో ప్లాట్ దగ్గరకు వెళ్లి ఇన్స్పెక్షన్ చేసినట్టు నటించాడు. ఆ తర్వాత అక్కడ నుంచి రైల్వే డిఆర్ఎం కార్యాలయం వద్దకు వచ్చేయాలని సూచించాడు. అక్కడ అడ్వాన్స్‌గా 60వేలు బాధితుని నుండి లంచంగా తీసుకుంటుండగా ఏఈ సురేష్ కుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ప్రకటన విడుదల చేశారు ఏసీబి అధికారులు. ఏఈ ని అదుపులోకి తీసుకుని అతని కార్యాలయంలో సోదాలు చేశారు.

**కటకటాల్లోకి అవినీతి అధికారి**

లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఏఈ సురేష్ కుమార్‌ను ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరిచారు అధికారులు. సురేష్ కుమార్‌ను జనవరి 10వ తేదీ వరకు రిమాండ్ విధించింది కోర్టు. దీంతో ఏఈ సురేష్ కుమార్‌ను సెంట్రల్ జైలుకు తరలించారు ఏసీబీ అధికారులు. ఏ ఈ పట్టుబడడంతో అవినీతి అధికారుల గుండెల్లో గుబులు పుడుతోంది. అవినీతి నిర్మూలించేందుకు ఏసీబీ ప్రత్యేక 14400 నెంబర్‌ను అందుబాటులో ఉంచిందని ఆ నెంబరును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఎవరైనా అధికారులు వేధింపులకు పాల్పడితే 14400 ద్వారా అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాలని డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

### భారతదేశం, ఇటలీ మధ్య మైగ్రేషన్ అండ్ మొబిలిటీ ఒప్పందాన్ని ఆమోదించిన క్యాబినెట్

మొత్తం రిజర్వ్ చేసిన కోటా 12000). వీటికితోడు ఇటాలియన్ వైపు ప్రస్తుత ఫ్లోస్ డిక్రీ ప్రకారం 2023, 2024 మరియు 2025 కోసం 3000, 4000 మరియు 5000 కాలానుగుణ భారతీయ కార్మికుల కోటాను రిజర్వ్ చేసింది (మొత్తం రిజర్వ్ చేసిన కోటా కాలానుగుణ కార్మికులకు 8000).

ఫ్లోస్ డిక్రీ ప్రకారం ఇటాలియన్ వైపు 2023-2025 నుండి కాలానుగుణ మరియు నాన్-సీజనల్ వర్కర్లకు ఇంక్రిమెంటల్ రిజర్వ్డ్ కోటాలను అందించింది. జాయింట్ వర్కింగ్ గ్రూప్ (జెడబ్ల్యుజీ) క్రింద చర్చించబడే ఆరోగ్య సంరక్షణ మరియు వైద్య సేవల రంగాలలో భారతీయ అర్హత కలిగిన నిపుణులను యూత్ మొబిలిటీ మరియు రిక్రూట్‌మెంట్ సులభతరం చేయడంపై ఒప్పందాల ద్వారా భారతదేశం మరియు ఇటలీల మధ్య మార్గాలను మరింత మెరుగుపరచడంపై ఉమ్మడి సహకారంపై కూడా ఒప్పందం అధికారికం చేస్తుంది.

అక్రమ వలసలకు వ్యతిరేకంగా పోరాటంలో రెండు దేశాల మధ్య సహకారం కూడా ఒప్పందం ద్వారా అధికారికం చేయబడింది.

ఈ ఒప్పందం అమలులోకి రావడానికి అవసరమైన అంతర్గత విధానాలను పూర్తి చేయడం గురించి పార్టీలు ఒకరికొకరు తెలియజేసుకునే రెండు నోటిఫికేషన్‌లలో చివరిది అందిన తేదీ తర్వాత రెండవ నెల మొదటి రోజున 5 సంవత్సరాల కాలానికి అమల్లోకి వస్తుంది. ఎవరైనా పాల్గొనే వారిచే రద్దు చేయబడకపోతే ఒప్పందం అదే వరుస వ్యవధిలో పునరుద్ధరించబడుతుంది.

ఈ ఒప్పందం జెడబ్ల్యూజీ ద్వారా పర్యవేక్షణ కోసం ఒక అధికారిక యంత్రాంగాన్ని అందిస్తుంది. ఇది కాలానుగుణంగా వర్చువల్ లేదా ఫిజికల్ మోడ్‌లో అమలును పర్యవేక్షిస్తుంది. సంబంధిత సమాచారాన్ని జెడబ్ల్యూజీ పంచుకుంటుంది. ఒప్పందం అమలును సమీక్షిస్తుంది. అమలుకు అవసరమైన మద్దతు ఇవ్వడానికి తగిన ప్రతిపాదనలన్నింటినీ చర్చిస్తుంది.

**పంచాంగం**

గురువారం 28-12-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం హేమంత ఋతువు
మార్గశిర మాసం

| | |
|---|---|
| తిథి | : బ. విదియ తె. 06.24 |
| నక్షత్రం | : పునర్వసు రా. 12.41 |
| వర్జ్యం | : ఉ. 11.52 ల 01.33 |

### ఘనంగా ఘటాల ఊరేగింపు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెంలో శ్రీ గంగ పరదేశమ్మ భవాని భక్తుల ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి చండీయాగ మహోత్సవాలలో భాగంగా గంగిరెగి చెట్టు వద్ద కలశ జ్యోతి ప్రదర్శన, ఘటాలు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కాండ్రేగుల శ్రీరామ్, మద్దాల శ్రీను, కే.సుబ్బు, కే. వెంకట, బీ.వర, వి.మహేష్, ఎం.గోపి, బి.ఆది, ఎం.సుబ్బు, పి.యుగంధర్, కే.సాంబ, బి.గంగాధర్, డి.కుమార్, కే. శంకర్రావు, ఎం.నగేష్, శ్రీ గంగ పరదేశమ్మ ఆశ్రమం భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

### వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం ఐదు లక్షల పదహారువేలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక దేముని గుమ్మంలో వేంచేసి యున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ముక్కోటి ఏకాదశి ఉత్సవాల అనంతరం దేవాలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి గోవింద రావు, కార్యనిర్వహణ అధికారిణి టి. రాజ సులోచన, మరియు ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో హుండీలు తెరిచి లెక్కించారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారి కీర్తి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన హుండీ లెక్కింపులో రూ 5,16,099 రూపాయలు ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి రాజ సులోచన తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి గోవింద రావు, కార్యనిర్వహణాధికారిణి టి. రాజసులోచన, ఉత్సవ అధికారులు కె .ఆదినారాయణ, ధర్మకర్తలు సుంకర వెంకటేశ్వరరావు, సూరిశెట్టి చిన్న సన్యాసి రావు, ముమ్మిని పైడిరాజు, శ్రీధరాల కోమలి రామ్మోహన్, రాజాన లక్ష్మి శ్రీనివాసరావు, బెల్లాన అనురాధ, ఎక్స్ అఫిషియో మెంబర్ పులఖండం గిరిబాబు, దేవాలయ సిబ్బంది, శ్రీహరి సేవ వాలంటీర్లు పాల్గొన్నారు.


# శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం

- 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.
- మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.

## కార్డోరియం ప్లస్




కావల్సిన వారు సంప్రదించండి:
9393949347

మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను ధృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా తొలగిస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్ఎంపి, పిఎంపి, డిఎంపి, బిఏఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్‌నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్‌షిప్ కొరకు సంప్రదించండి.స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.

90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.
మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.
అందరూ ఆరోగ్యంగా ఉండండి.



జనహిత ట్రస్ట్(రి)
9-3-16, పిఠాపురం కోలని,
విశాఖపట్నం- 530003
ఫోన్: 8247526179

Compli

## అయోధ్య రాముని అక్షింతలతో ధనుర్మాసం మేలుకొపులు



**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):** ధనుర్మాసం ప్రారంభం నుండి మండలంలోని చాలా గ్రామాల్లో "సమరసతా సేవా ఫౌండేషన్" ఆధ్వర్యంలో బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి చన్నీటి స్నానాలు చేసి భక్తి శ్రద్ధలతో ధనుర్మాసం మేలు కొపులు నిర్వహిస్తున్నారు. గోకివాడలో "శ్రీరామ్ జై రామ్ జయ జయ రామ్" అని నామస్మరణ చేస్తూ "అయోధ్య రాముని స్పర్శిత అక్షింతలు" గోకివాడ ప్రధాన వీధులలో ఊరేగించారు. చాంద్రమానం ప్రకారం మార్గశిరమాసం, సూర్యమానం ప్రకారం ధనుర్మాసం దైవానుగ్రహము కలిగిన రెండు కలిసి ఉండటం, ఈ మాసంలో దేవతలు భూమిపై సంచరిస్తారని దేవుని నామం చెప్పుకుంటూ నగర సంకీర్తన చెయ్యటం వల్ల దేవతలు గ్రామ ప్రజలని ఆశీర్వదిస్తారన్నారని "సమరసతా సేవా ఫౌండేషన్" యలమంచిలి ఖండ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు అన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల ఉమ, ధార్మిక సమితి సభ్యులు పాల్గొన్నారు.

## వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యలమంచిలి మున్సిపాలిటీలో ప్రతిపాదించిన బడ్జెట్ ఆమోదం పొందింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిళ్ళా రమాకుమారి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదిత బడ్జెట్‌తోపాటు 2023-24 సవరించి అంచనా బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టగా, కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. అనంతరం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పలు సమస్యలను చైర్‌పర్సన్ ముందు ఉంచారు. సమస్యలు పరిష్కరించాలని సంభందిత అధికారులకు ఆమె సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, మ్యానేజర్ ప్రభాకర్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు గుప్తా, నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు, టిపిఓ శ్రీలక్ష్మి, ఆర్వో నీలిమ, ఆర్ ఐ గోవింద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గంగవరం పోర్టు - తుంగ్లాం రోడ్డు నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గాజువాక, ఆటోనగర్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు గంగవరం అదానీ పోర్టు నుంచి కార్గో వాహనాల రాకపోకలు సులువుగా సాగేందుకు అనువుగా సాగరమాల ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన గంగవరం పోర్టు - తుంగ్లాం హైవే రోడ్డు నిర్మాణంపై జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున సమీక్షించారు. స్థానిక ప్రజలు, పరిశ్రమల నిర్వాహకుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని మార్చిన అలైన్మెంట్, కొత్త డీపీఆర్ రూపకల్పనపై సంబంధిత అధికారులతో వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా భూసేకరణ చేపట్టి, బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు సూచించారు. గతంలో రూపొందించిన డీపీఆర్ పై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని డిజైన్లో పలు మార్పులు చేసినట్లు ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వే, ఇరిగేషన్, స్టీల్ ప్లాంట్, ఆర్ & బి అధికారులతో సంయుక్త క్షేత్ర స్థాయి పరిశీలన చేశామని తెలిపారు. తదుపరి చేపట్టబోయే చర్యల గురించి కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం గంగవరం పోర్టు గేటు ముందు భాగం నుంచి తుంగ్లాం వరకు 10.230 కి.మి. మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో వ్యవహరించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, భవిష్యత్తులో ట్రాఫిక్ రద్దీ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ డా॥ ఎ. మల్లిఖార్జున సూచించారు.

సమావేశంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, ఎన్.హెచ్.ఎ.ఐ. పీడీ ప్రభత్ రంజన్, గంగవరం అదానీ పోర్టు సీఈవో బీజీ గాంధీ, హెచ్.ఆర్. హెడ్ సీఎస్ రాజు, వివిధ శాఖల అధికారులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ప్రకటన నెం. eT-Central-WAT-52-2023, తేది: 15.12.2023

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో KK-I లైను నందు సీనియర్ డివిజనల్ ఇంజనీరు/సెంట్రల్/వాల్తేరు వారి పరిధిలో కొత్తవలస (EX)-కోరాపుట్ స్టేషన్స్ మధ్యన 3.637 ట్రాక్ కి.మీ (ప్యాచెస్‌లో) పొడవు కొరకు త్రూ స్లీపర్ రిన్యూవల్ (ప్రైమరీ).

**సుమారు పని విలువ:** ₹75,73,041.05.

బయానా: ₹1,51,500.00. పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 09.01.2024న 1500 గంటలు.

పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా ఇట్టి ఇ-టెండర్లుకు సంబంధించి పంపిన మాన్యువల్ ఆఫర్లు అంగీకరించబడవు.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు/సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 10 (పది) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్), వాల్తేరు

PR-921/O/23-24

## ఉపాధ్యాయుల పోరుబాట - యూ టి ఎఫ్



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉపాధ్యాయులు పోరుబాటకు సిద్ధమయ్యారు ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు ఇస్తానని సీఎం జగన్మోహన్ రెడ్డి 16వ తారీకు న కూడా జీతాలు ఇవ్వడం లేదని పెన్షన్ దారులు అందరు ఎన్నో ఇబ్బందులకు గురవ్వుతూ కష్టాలు పడాల్సి వస్తుందని వారన్నారు.

అలానే రిటైర్డ్ అయినా ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా వెంటనే చెల్లించి కష్టానికి ప్రతి ఫలం ఉంటే సంతోషంగాని అయన ఎన్నికలులలో ఒకలాగా అధికారంలోకి రాగానే ఇబ్బందులకు గురు చేస్తున్నారని ఉపాధ్యాయులు వాపోయారు. జనవరి 3న జిల్లా కేంద్రాలలో ధర్నా ఉంటుందని తరువాత 9,10 తేదీలలో రాష్ట్ర కేంద్రంలో 36 గంటలు ధర్నా ఉంటుందని రాష్ట్ర నాయకులు తెలిపారు మండలం నాయకులు పి.వెంకట్రావు ఇక్కడ పత్రికా విలేకరులకు తెలిపారు.

## మహిళల కొరకు మొబైల్ పింక్ టాయిలెట్స్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ నగరంలో మహిళల కొరకు ప్రత్యేకంగా మొబైల్ పింక్ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. బుధవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలో రెండు మొబైల్ పింక్ టాయిలెట్స్‌ను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వై.ఎస్.ఆర్.సి.పి ఫ్లోర్ లీడరు బాణాల శ్రీనివాసరావులతో కలిసి ప్రారంభోత్సవం చేసి, మొబైల్ పింక్ టాయిలెట్స్ నందు మహిళల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ, జివిఎంసికి చెందిన రెండు బస్సులను సుమారు రూ.11.5 లక్షల వ్యయంతో మొబైల్ పింక్ టాయిలెట్లుగా ఆధునికరించడం జరిగిందని తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా "స్వచ్ఛ విశాఖ" లక్ష్యంగా టాయిలెట్ 2.0 చాలెంజ్‌లో భాగంగా 20 టాయిలెట్లను విశాఖ నగరంలో ప్రత్యేకంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అందు రెండు మొబైల్ పింక్ టాయిలెట్లను నేడు ప్రారంభించడం జరిగిందని, ఈ మొబైల్ పింక్ టాయిలెట్ల నందు ప్రత్యేకంగా మహిళల కొరకు బాత్రూం, ఇండోర్ లైటింగ్, ఫ్యాన్, ఇన్సినరేటర్‌తో కూడిన శానిటరీ ప్యాడ్, వెండింగ్ మిషన్, ఇన్సినరేటర్‌తో కూడిన డైపర్ డిస్పెన్సరీ, తగిన సీట్లతో కూడిన బేబీ ఫీడింగ్ రూమ్ వంటి పలు సౌకర్యాలు కల్పించబడ్డాయని ఆమె తెలిపారు. ఈ మొబైల్ పింక్ టాయిలెట్లను బీచ్ రోడ్లలోను, రద్దీ ప్రాంతాలలోనూ, పబ్లిక్ మీటింగ్‌ల వద్ద ఏర్పాటు చేయుటకు మహిళల సౌకర్యర్థమై జివిఎంసి అందు బాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఏ.ఎం.ఓ.హెచ్ కిషోర్, పర్యవేక్షక ఇంజనీర్ (మెకానికల్) కృష్ణారావు, కార్య నిర్వహణ ఇంజనీర్ దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఏర్పాట్లను పరిశీలించిన జివిఎంసి కమిషనర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేసామని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ తెలిపారు. బుధవారం ఆయన ఎ.యు.కన్వెన్షన్ సెంటర్‌ను సందర్శించి వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ డిసెంబర్ 28వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏయూ కన్వెన్స్ హాలుకు వస్తున్నందున ఆ ఏర్పాట్లను సిద్ధం చేస్తామని తెలిపారు. అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్ లను పరిశీలించారు. తదుపరి జివిఎంసి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పదివేల మొక్కల నాటే కార్యక్రమం లో భాగంగా కన్వెన్స్ సెంటర్ ఆవరణలో గవర్నర్‌చే మొక్కను నాటే ప్రదేశాన్ని సందర్శించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ వర్మ, వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నోడల్ ఆఫీసర్ తారక ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన రూరల్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జనసేన ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా కార్యవర్గం ప్రమాణస్వీకారం అత్యంత ఘనంగా జరిగింది. బుధవారం స్థానిక రింగ్ రోడ్‌లో ఉన్న పెంటకోట కన్వెన్షన్ హాల్లో జనసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. 35 మంది జనసైనికులతో పార్టీ నూతన కార్యవర్గం ఏర్పాటు అయింది. పార్టీ పీఏసి కోన తాతారావు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా తాతా రావు మాట్లాడుతూ జనసైనికులు ఉత్సాహం చూస్తుంటే అనకాపల్లిలో పండగ వాతావరణం కనిపిస్తోందని అన్నారు. రెండు సార్లు శాసనసభ్యుడిగా పనిచేసిన పంచకర్ల రమేష్ బాబు నిబద్ధతతో పనిచేసే నాయకుడని ఆయన కొనియాడారు. ప్రతి కార్యకర్త సమదికోత్సాహంతో సైనికుడిలా పనిచేసి వచ్చే ఎన్నికల్లో అన్నిస్థానాల్లో విజయం సాధించేలా పనిచేయాలన్నారు. నాలుగున్నర ఏళ్ల తర్వాత పంచకర్ల నాయకత్వంలో జనసైనికులకు కార్యవర్గం ఏర్పాటుతో నూతన ఉత్సాహం వచ్చిందని, అది స్పష్టమవుతోందని అన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కార్యవర్గం పార్టీ బలపేతానికి కృషిచేసి తాము ఎదగాలని అన్నారు. బాధలలో ఉన్న వారికే నాయకత్వం గురించి తెలుస్తుందని జనసేన అధినేత పవన్ అంటారన్నారు. పదేళ్లుగా పార్టీని జనసైనికులు ముందుండి నడిపిస్తున్నారని ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా బలమైనదని పట్టుగలదని ఆయన అన్నారు. పార్టీ అధినేత బలమైన కెప్టెన్ పంచకర్ల రమేష్ బాబుకు రూరల్ జిల్లా పార్టీ నాయకత్వం ఇచ్చారని ఆయన నాయకత్వంలో జనసేన పార్టీ విజయ బావుటా ఎగరవేయాలని అందుకు ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన అనకాపల్లి నియోజక వర్గం ఇన్‌చార్జ్ పరుచూరి భాస్కరరావు మాట్లాడుతూ తెలుగుదేశం జనసేన పార్టీలకు చెందిన ఎవరికి సీటు వచ్చిన వారి విజయానికి ప్రతి జనసైనికుడు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బొలిశెట్టి సత్య, ఇందల రమణ, కందుల వీరాజు, పంచకర్ల సందీప్, మహిళా నేత కిరణ్ ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రూరల్ జిల్లా నాయకులు పంచకర్ల రమేష్ బాబును ఘనంగా సత్కరించారు.

## కలెక్టర్‌ను కలసిన నూతన సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** పాడేరు డివిజన్ సబ్ కలెక్టర్‌గా పి. ధాత్రి రెడ్డిని ప్రభుత్వం నియమించిన విషయం విదితమే. ఆమే బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో సబ్‌కలెక్టర్‌గా భాద్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఆమె కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఓటరు జాబితా సవరణలో భాగంగా, పాడేరు నియోజకవర్గ పరిధిలో అందిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

## లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో లక్ష్యాల మేరకు రుణాల మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డిసిసి డిఎల్ఆర్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాఖల ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన రుణాలు మంజూరు చేయడంలో అవసరమైన డాక్యుమెంట్ల పట్ల వారికి అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన రుణాలను వీలైనంత వేగంగా అందజేసేందుకు కృషి చేయాలన్నారు. గతంలో వారు చేసిన రుణ చెల్లింపులు, బ్యాంకు లావాదేవీలను ప్రామాణికంగా తీసుకోవచ్చన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి రుణాలు కూడా త్వరగా అందజేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడాలన్నారు. డి ఆర్ డి ఏ, వ్యవసాయ పశుసంవర్ధక, పరిశ్రమల శాఖల అధికారులు బ్యాంకు అధికారులను సమన్వయం చేసుకుంటూ వారి శాఖకు చెందిన లబ్ధిదారులకు రుణాలు వీలైనంత వేగంగా మంజూరయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల ద్వారా అందజేసిన రుణాలను వివరించారు. ఈ సమావేశంలో కన్వీనర్, యు.బి.ఐ. రీజనల్ మేనేజర్ పి.నరేష్, ఆర్బిఐ ఏజీఎం హనుమ కుమారి, నాబార్డ్ ఏజీఎం సుమంత్, మెప్మా పీడీ సరోజినీ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రసాద్ రావు, వ్యవసాయ శాఖ జెడి మోహన రావు, ఉద్యానవన శాఖ డిడి ప్రభాకర్ రావు, డిఆర్ డిఎ పి.డి. శచీదేవి, మత్స్య శాఖ డిడి ప్రసాద్ రావు, జిఎం డిఐసి శ్రీధర్, వివిధ శాఖల బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ (పి ఎల్ పి) పుస్తకాన్ని ఆవిష్కరించారు.

**విశాఖ సమాచారమ్**

ప్రతులకు, ప్రకటనలకు

సెల్: 9393949345

8247526179

## సమ్మె కాలంలో పారిశుద్ధ్య పనుల అంతరాయానికి సహకరించండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో పాల్గొన్నందున పారిశుద్ధ్య నిర్వహణ పనులకు కలుగు అంతరాయానికి నగర ప్రజలందరూ సహకరించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి బుధవారం పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ప్రతి ఇంటా ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను నివాసితులు మీ సమీపంలో ఉన్న డస్ట్ బిన్ లో వేయాలని ఆమె కోరారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను పడివేసినట్లయితే వీధులు, రోడ్లు అపరిశుభ్రత చెందడమే కాకుండా దోమలు వృద్ధి చెంది ప్రజలకు అనారోగ్యం కలుగుతుందని తెలియజేశారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార దిశగా చర్యలు చేపడు తున్నందున త్వరలో సమ్మె సమస్యకు తగిన పరిష్కారం జరిగి కార్మికులు యధావిధిగా విధులకు హాజరవుతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేస్తూ, అంతవరకు ప్రజలు జివిఎంసికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మీకు మధుమేహం ఉంటే క్యారెట్ తినడం సురక్షితమా?



సూప్‌లు, సలాడ్‌లు, మిక్స్‌డ్ వెజ్ కూరలు లేదా హల్వా ఇలా క్యారెట్‌లను దేనిలోనైనా విరివిగా వాడుతారు. రుచిలో తియ్యగా ఉండటం వల్ల వీటిని ఇష్టంగా తినడం తప్పు కాదు. విటమిన్లు, ఖనిజాలు, కార్బోహైడ్రేట్లతో సమృద్ధిగా ఉండే క్యారెట్ యొక్క ప్రయోజనకరమైన లక్షణాలకు అంతం లేదు. వైద్యుల ప్రకారం, పిల్లల మరియు పెద్దల రోజువారీ ఆహారంలో ఈ కూరగాయలను ఉంచడం చాలా ముఖ్యం.

క్యారెట్‌లో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి మరియు మెత్తగా ఉండే కూరగాయలు కాబట్టి, మధుమేహ వ్యాధిగ్రస్తులు సాధారణంగా క్యారెట్ తినడానికి భయపడతారు. అయితే క్యారెట్‌ను మితంగా తినడం వల్ల భయపడాల్సిన పని లేదని, అది ఆరోగ్యానికి మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు అంటున్నారు.

**రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది**

క్యారెట్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. కాబట్టి క్యారెట్ రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. అంతేకాదు క్యారెట్‌లోని కెరోటినాయిడ్స్, ఫైబర్ మరియు విటమిన్ ఎ, రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయ పడతాయి. కాబట్టి డయాబెటిక్ పేషెంట్లు క్యారెట్‌ను మితంగా తినడం మంచిది.

**కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది**

డయాబెటిక్ రోగులలో కంటి సమస్యలు సర్వసాధారణం. క్యారెట్‌లో ల్యూటిన్ మరియు జియాక్సంతిన్ అనే కెరోటినాయిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో బీటా కెరోటిన్ కూడా ఉంటుంది, ఇది శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. ఈ పదార్థాలన్నీ కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి చాలా ఉపయోగపడతాయి. కంటి చూపును మెరుగు పరచడంలో సహాయ పడుతుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది**

క్యారెట్ మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇందులో విటమిన్ ఎ మరియు విటమిన్ సి ఉంటాయి. ఈ విటమిన్లు యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఫలితంగా, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి క్యారెట్లను క్రమం తప్పకుండా తినండి. రోజువారీ ఆహారంలో క్యారెట్‌ను చేర్చుకోవడం కూడా కాలేయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

**క్యారెట్ యొక్క పోషక విలువ**

క్యారెట్‌లో కేలరీలు తక్కువగా ఉంటాయి, కానీ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫలితంగా శరీరంలోకి తక్కువ కేలరీలు చేరినా క్యారెట్ తినడం వల్ల కడుపు త్వరగా నిండిపోతుంది. ఇది బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. అంతే కాకుండా, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో మరియు కంటి చూపును మెరుగుపరచడంలో క్యారెట్ మంచిది.

క్యారెట్ కార్బోహైడ్రేట్లు, విటమిన్ K1, పొటాషియం, బీటా-కెరోటిన్ మరియు యాంటీఆక్సిడెంట్ల యొక్క అద్భుతమైన మూలం. ఇందులో విటమిన్ ఎ, కాల్షియం, మెగ్నీషియం మరియు ఫోలేట్ కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ప్రొటీన్లు, కొవ్వులు మరియు సోడియం చాలా తక్కువ. క్యారెట్‌లోని పీచు పొట్టను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

# చలికాలంలో శరీరానికి బలం చేకూర్చే ఖర్జూరం హల్వా



చలికాలంలో వేడి వేడి హల్వా తినాలని ఎవరికి ఉండదు చెప్పండి. ఈ సీజన్‌లో ప్రతి ఒక్కరూ క్యారెట్ హల్వా, దాల్ హల్వా మరియు సెమోలినా హల్వా తింటారు. అయితే ఖర్జూరం హల్వా ఎప్పుడైనా తిన్నారా? ఖర్జూరం హల్వా తింటే చాలా రుచిగా ఉంటుంది. ఖర్జూరం హల్వా చలికాలంలో శరీరానికి ఎంతో మేలు చేస్తుంది.

**ఖర్జూరంలోని పోషకాలు:-** ఖర్జూరంలో ప్రోటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్లు, పొటాషియం, కాల్షియం, రైబోఫ్లావిన్, నియాసిన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఎ మరియు విటమిన్ సి వంటి పోషకాలు ఉంటాయి.

**ఖర్జూరం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు:-**

**రక్తహీనత సమస్య నుంచి ఉపశమనం:** రక్తహీనత అనేది శరీరంలో ఇనుము లేకపోవడం వల్ల వచ్చే సమస్య. శరీరంలో రక్తం లేకపోవడంతో రక్తహీనత సమస్య వస్తుంది. చాలా మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. మీరు కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లయితే, మీరు ఖర్జూర హల్వాను తినవచ్చు. ఖర్జూరంలో మంచి మొత్తంలో ఐరన్ ఉంటుంది, ఇది రక్తహీనతను అంటే శరీరంలో హిమోగ్లోబిన్ లోపాన్ని నయం చేస్తుంది.

**కండరాలను బలోపేతం చేయడానికి:** కండరాలను బలోపేతం చేయడానికి మీరు ఖర్జూర హల్వాను కూడా తినవచ్చు. ఖర్జూరాల్లో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇది కండరాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఖర్జూరం తింటే గుండె కండరాలు కూడా బలపడతాయి. మీరు ఎల్లప్పుడూ మీ ఆరోగ్యాన్ని కాపాడుకో వాలనుకుంటే, మీరు చలికాలంలో ఖర్జూరం హల్వా తినవచ్చు.

**గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తక్కువ:** ఖర్జూరం పుడ్డింగ్ గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నిజానికి ఖర్జూరంలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు మరియు యాంటీ అపోప్టోటిక్ లక్షణాలు ఉంటాయి. ఇది గుండెపోటును నివారించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా ఖర్జూరం తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ సమస్యలు కూడా తగ్గుతాయి.

**చలికాలంలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడం:** చలికాలంలో మీరు తరచుగా అనారోగ్యంతో బాధపడుతుంటే, మీరు ఈ హల్వాను తినాలి. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ఇది మంచి మార్గం.

**రాత్రిపూట మూత్ర విసర్జన చేసే పిల్లలకు మేలు చేస్తుంది :** రాత్రిపూట మూత్ర విసర్జన చేసే పిల్లలకు ఖర్జూరం హల్వా ఎంతో మేలు చేస్తుంది. ప్రతిరోజూ ఒక చెంచా ఖర్జూరాన్ని పాలతో కలిపి తీసుకుంటే పిల్లలు రాత్రిపూట నిద్రపోయేటప్పుడు మూత్రవిసర్జన ఆపుతారు. ఇది లోపలి నుండి శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తుంది.

**ఖర్జూరం హల్వా చేయడానికి కావలసిన పదార్థాలు:** పాలు - లీటరు, ఖర్జూరం - 200 గ్రాములు, చక్కెర - 100 గ్రాములు, తురిమిన కొబ్బరి - 2-3 టేబుల్ స్పూన్లు, దేశీ నెయ్యి - 4-5 టేబుల్ స్పూన్లు, జీడిపప్పు - 10 నుండి 12, బాదం - 10-12, ఎండుద్రాక్ష - 10-12, కొద్దిగా యాలకుల పొడి.

**ఖర్జూరం హల్వా ఎలా తయారు చేయాలి:** ఖర్జూర హల్వా సిద్ధం చేయడానికి ముందుగా ఖర్జూరాలను దాదాపు 6 నుండి 8 గంటలపాటు పాలలో నానబెట్టాలి. దీని తర్వాత ఖర్జూరం గింజలన్నీ తీసి గ్రైండర్ సహాయంతో పేస్ట్‌లా చేసుకోవాలి. జీడిపప్పు, బాదం, ఇతర డ్రై ఫ్రూట్స్‌ని చిన్న ముక్కలుగా కోయాలి. ఇప్పుడు ఒక పాన్ తీసుకుని అందులో నెయ్యి వేసి వేడి చేయాలి. దీని తర్వాత ఈ పాన్‌లో ఖర్జూరం పేస్ట్ వేసి బంగారు రంగు వచ్చేవరకు బాగా ఉడికించాలి. ఇప్పుడు అందులో పంచదార మరియు పాలు వేసి తక్కువ మంట మీద ఉడికించాలి. గట్టిపడే వరకు మెత్తగా పిండి వేయండి. దీని తర్వాత డ్రై ఫ్రూట్స్ వేసి, ఖర్జూర్ హల్వా రుచికి సిద్ధంగా ఉంటుంది.

# మీకు జుట్టు సమస్య ఉందా?



దట్టమైన అడవిలా దట్టమైన వెంట్రుకలు, తాటిచెట్టులా పొడవాటి వెంట్రుకలు, పట్టువలే సిల్కీలా మెరిసే వెంట్రుకలు కావాలనుకుంటున్నారా? అయితే, ఈ నూనె మీ జుట్టుకు అద్భుతాలు చేస్తుంది.

మీరు మీ జుట్టుకు మెరిసే రూపాన్ని అందించడానికి ఉపయోగించే గొప్ప, బహుళ ప్రయోజనాలున్న హెయిర్ ఆయిల్ కోసం చూస్తున్నట్లయితే, ఆముదం నూనె పరిష్కారం. మీ జుట్టుకు ఆముదం వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాల గురించి మీలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

మందార మొక్క ఉష్ణమండల ప్రాంతాల్లో కనిపించే ఒక సాధారణ పుష్పించే మొక్క. దీని ఆకులు మరియు పువ్వులు మీ జుట్టుకు వివిధ ప్రయోజనాలను అందిస్తాయి. ఇది చాలా సంవత్సరాలుగా పురాతన ఔషధం మరియు జుట్టు సంరక్షణ ఉత్పత్తులలో ఉపయోగించబడింది. మహిళలు కూడా మందార పువ్వులను అలంకరణగా తలలో పెట్టుకుంటారు. ఆధ్యాత్మిక పరంగా దేవుడికి సమర్పిస్తారు. ముఖ్యంగా వినాయకుడికి అతి ఇష్టమైన పుష్పాల్లో ఇది ఒకటి.

మందార మొక్క ఆకులు మరియు పువ్వులు ముఖ్యమైన నూనెను ఉత్పత్తి చేస్తాయి. కొబ్బరి నూనె ఎంత ప్రభావ వంతంగా ఉంటుందో అలాగే, మందారంలో కూడా యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు A మరియు C, మరియు ఆల్ఫా-హైడ్రాక్సీ ఆమ్లాలు మరియు అమైనో ఆమ్లాలు అధికంగా ఉంటాయి.

ఇది మీ చర్మం మరియు జుట్టుకు అద్భుతమైన డీప్ కండిషనింగ్ చికిత్సను చేస్తుంది. ఆముదం జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది మరియు మెరిసేలా చేస్తుంది. అలాగే జుట్టుకు అప్లై చేసినప్పుడు అకాల గ్రేయింగ్ మరియు చుండ్రును నివారిస్తుంది. మందారం హెయిర్ ఆయిల్ వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

**జుట్టు పెరుగుదలలో సహాయపడుతుంది**

మందారం నూనె ఒక సమర్థవంతమైన జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు మరియు విటమిన్ సి పుష్కలంగా ఉన్న ఈ నూనె జుట్టు కుదుళ్లకు పోషణను అందిస్తుంది మరియు రక్త ప్రవాహాన్ని, కొత్త జుట్టు పెరుగుదల మరియు ప్రసరణను ప్రేరేపిస్తుంది.

మందారం నూనె సహజంగానే జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. అలాగే, ఇది జుట్టును ఒత్తుగా చేస్తుంది మరియు రెగ్యులర్ వాడకంతో జుట్టు రాలడాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

**జుట్టును బలపరుస్తుంది**

ప్రతిరోజూ మందారం నూనెను అప్లై చేయడం వల్ల బలహీనమైన మరియు పెళుసుగా ఉన్న జుట్టును వదిలించుకోవచ్చు. ఇందులో విటమిన్లు, మినరల్ మరియు ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి, ఇది జుట్టు షాఫ్ట్‌ను బలపరుస్తుంది. ఇది జుట్టు చివర్ల చిట్లడాన్ని తగ్గిస్తుంది.

మీ జుట్టు బలంగా ఉన్నప్పుడు, అది స్టైలింగ్, వేడి మరియు ఒత్తిడడి మరింత విజయవంతంగా తట్టుకోగలదు. లేకపోతే, మీ జుట్టు దెబ్బతినే అవకాశం ఉంది.

**మీ జుట్టును నియంత్రిస్తుంది**

మందారం నూనె జుట్టుకు గొప్ప సహజ కండీషనర్‌గా పనిచేస్తుంది. ఇది లోతుగా హైడ్రేట్ చేస్తుంది మరియు తేమ సమతుల్యతను నిర్వహిస్తుంది. మందారలోని ఎమోలియెంట్ గుణాలు జుట్టును మెరిసేలా మరియు మృదువుగా మార్చడంలో సహాయపడతాయి. మందారం నూనె ఆవనూనె పొడి, చిరిగిన జుట్టుకు తేమను మరియు మెరుపును జోడిస్తుంది.

**తలకు పోషణనిస్తుంది**

తలకు పునరుజ్జీవనం మరియు పోషణలో మందారం నూనె చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇందులోని యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు చుండ్రు చికిత్సకు, చికాకులను ఉపశమనానికి మరియు ఆరోగ్యకరమైన స్కాల్ప్ నిర్వహించడానికి సహాయపడతాయి.

మందారంనూనె ఆరోగ్యకరమైన శిరోజాలను రూపొందించడంలో సహాయపడుతుంది. ఇది ముదురు రంగు మరియు ఆరోగ్యకరమైన జుట్టుకు పునాది.

# రవ్వ త్వరగా పురుగు పట్టకుండా నిల్వ చేయడం ఎలా ?



రవ్వ మరియు సేమియా మన నిత్యవసర వస్తువుల్లో ఒకటి. ఇది భారతీయ వంటశాలలలో ఒక ప్రసిద్ధ పదార్థం. హల్వా, ఉప్మా, చిల్లా మరియు ఇడ్లీ మొదలైన అనేక రకాల వంటకాలను తయారు చేయడానికి దీన్ని పయోగిస్తారు. ఇది దురుమ్ గోధుమ నుండి తయారు చేయబడిన మరియు మిల్లింగ్ చేసిన ముతక పిండి. దేశవ్యాప్తంగా వంటలలో ఒక విలక్షణమైన ఆకృతి, రుచి కలిగి ఉంటుంది.

ఈ పదార్థం ఏదైనా వంటకంలో ఉపయోగించే ముందు ఎక్కువగా వేయిస్తుంటారు. దక్షిణ భారతదేశంలో 'రవ్వ' అని పిలువబడే రవ్వ, సేమియాలను వేయించి మరియు నిల్వ చేయడానికి ఉత్తమమైన మార్గాన్ని ఇక్కడ తెలియజేస్తున్నాము. కానీ, నిల్వ చేయాడానికి ముందు తప్పనిసరిగా ఎందుకు వేయించాలో మొదట ఇక్కడ తెలుసుకోండి.

**రవ్వ లేదా సేమియాను ఎందుకు వేగించాలి?**

సీజన్ ఏదైనా, రవ్వ లేదా సెమోలినా అనేది ఒక కంటైనర్‌లో ఉంచబడినా లేదా తప్పుడు మార్గంలో నిల్వ చేసినా ఆహార నాణ్యతకు ఆటంకం కలిగించే కొన్ని రకాల పురుగులు ఏర్పడవచ్చు. ఈ పరిస్థితిలో, రవ్వను వేగించడం, దానిని నిల్వ చేయడం చాలా అవసరం. ఈ విధంగా, నిల్వ చేసిన రవ్వలో పురుగులు లేదా ఇతర కీటకాలు ఏర్పడే అవకాశం చాలా తక్కువ.

**వేయించిన రవ్వను ఎక్కడ నిల్వ చేయాలి?**

వేగించిన రవ్వను చల్లని మరియు పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి, రిఫ్రిజిరేటర్ కంటే మెరుగైన ప్రదేశం ఏమిటి! మీరు రవ్వను రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే, అది చాలా కాలం పాటు తాజాగా ఉంటుంది. పురుగు పడదు. అలాగే వేయించిన రవ్వలో కొన్ని దాల్చిన చెక్క ముక్కలు వేస్తే రవ్వలో పురుగు పడదు.

**రవ్వను వేగించడానికి సరైన మార్గం:** రవ్వ వేయించడానికి, ఒక పాన్‌లో 2-3 చెంచాల నెయ్యి వేసి, కరిగిన తర్వాత ఆ రవ్వ వేసి, తక్కువ మంటపై ఎక్కువ సేపు కలియబెడుతూ రవ్వను వేగించాలి. ఇలా చేయడం వల్ల రవ్వ పానుకు అంటుకోదు మరియు మాడిపోదు. రవ్వ వేగే వరకూ మీరు అక్కడే ఉండాలి. అటూ ఇటూ వెళ్ళారునుకోండి. రవ్వ మాడిపోతుంది. అందుకే రవ్వను తక్కువ మంటపై వేగించాలి, గరిటతో కలుపుతూ ఉండండి. వేయించిన తర్వాత, దానిని చల్లార్చి గాజు పాత్రలో నిల్వ చేయండి.

**తాజా ఆకులను కంటైనర్‌లో ఉంచండి:** వేయించిన రవ్వ పాత్రలో బిర్యాని ఆకులు, తులసి ఆకులు మరియు వేప ఆకులు వేసి నివ్వ ఉంచినట్లయితే, రవ్వ ఒక నెల పాటు తాజాగా ఉంటుంది.

**వేగించిన రవ్వ తయారీకి వంటకాలు:** ఇది వివిధ రకాల వంటకాలను తయారు చేయడానికి ఉపయోగించే బహుముఖ పదార్థం. అయితే, ఇక్కడ వేయించిన రవ్వతో తయారు చేయగల కొన్ని సులభమైన ఇంకా రుచికరమైన వంటకాలు ఉన్నాయి.

**ఉప్మా:** పచ్చి బఠానీలు, కాలీఫ్లవర్, గ్రీన్ బీన్స్, క్యారెట్లు, బంగాళదుంపలు మరియు మసాలా దినుసుల మిశ్రమం వంటి వివిధ రకాల కూరగాయలతో వేగించిన రవ్వను వండడం ద్వారా ఇది ఒక క్లాసిక్ సౌత్ ఇండియన్ డిష్ ఉప్మా రెడీ అవుతుంది. తరచుగా ఈ వంటకం జీడిపప్పుతో అలంకరించ బడుతుంది, ఇది ఉప్మా యొక్క రుచిని పెంచుతుంది. ఇది హృదయపూర్వక మరియు రుచికరమైన వంటకం, దీనిని అల్పాహారంలో ఎక్కువగా తీసుకుంటారు.

**వోట్మీల్:** మనం గోధుమపిండిని ఎలా తయారుచేస్తామో అదే విధంగా ఈ వంటకాన్ని కూడా తయారుచేయవచ్చు. ఇది రవ్వకు కొద్దిగా పాలు లేదా నీటిని కలిపి వండడం ద్వారా ఓ రుచికరమైన మరియు పోషకమైన వంటకం. దీన్ని రుచికి అనుగుణంగా బెల్లం/చక్కెర లేదా తేనెతో జోడించవచ్చు. అదనపు రుచి కోసం కొన్ని పండ్లు మరియు గింజలతో ఆస్వాదించవచ్చు.

**రవ్వ హల్వా:** ఇది పండుగలు మరియు ప్రత్యేక సందర్భాలలో తయారు చేయబడిన ప్రసిద్ధ భారతీయ స్వీట్. ఈ హల్వా నవరాత్రి భోగ్‌లో భాగంగా ఉంటుంది మరియు నెయ్యి, పంచదార మరియు పాలతో వేయించిన రవ్వను వండుతారు. ఇది చాలా చిక్కగా లేదా చాలా పల్చగా లేని కావలసిన స్థిరత్వాన్ని పొందిన తర్వాత, హల్వా అనేక డ్రై ఫ్రూట్స్ మరియు ఎండుద్రాక్షలతో పాటు ఏలకులు మరియు కుంకుమపువ్వు వంటి సుగంధ ద్రవ్యాలతో కలుపుతారు.

**ఇడ్లీ:** దక్షిణ భారతదేశంలో, ఇడ్లీ సాంబార్ అనేది ఒక ప్రసిద్ధ వంటకం, ఇది రోజులో ఎప్పుడైనా ఆనందించవచ్చు. ఈ ఇడ్లీని తయారు చేయడానికి వారు పులియబెట్టిన బియ్యం పిండిని ఉపయోగిస్తారు. కానీ, రవ్వ ఇడ్లీలకు ప్రత్యేకమైన రుచిని జోడిస్తుంది కాబట్టి ఇది ఇడ్లీలను తయారు చేయడానికి కూడా ఒక ప్రసిద్ధ ఎంపిక. మీరు చేయాల్సిందల్లా వేయించిన రవ్వలో కొంచెం పెరుగు మరియు రుచికి ఉప్పు వేసి కొంచెం నీరు కలపండి మరియు కాసేపు పులియనివ్వండి. పులియబెట్టినప్పుడు, ఇంట్లో రుచికరమైన మరియు మెత్తటి ఇడ్లీలను తయారు చేయండి.

**చీలా:** చీలా అల్పాహారం తినడానికి ఒక రుచికరమైన మార్గం మరియు వేగించిన రవ్వతో సులభంగా తయారు చేయవచ్చు. మీరు చేయాల్సిందల్లా ఇంట్లో తయారుచేసిన పెరుగు, మీకు ఇష్టమైన కూరగాయలు మరియు ఎర్ర కారం, పసుపు మరియు ఉప్పు వంటి కొన్ని మసాలా దినుసులతో కలపండి. పిండిని తయారు చేసి, సరిగ్గా ఉత్తపం వలె ఉడికించాలి. గ్రీన్ చట్నీ లేదా పెరుగు డిప్‌తో ఆనందించండి.

# చిన్న వయసులోనే గురక వస్తోందా?

గురక అనేది చాలా సాధారణ సమస్య. ఈ రోజుల్లో అనేక మంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. చాలా మంది గురకను చెడు అలవాటుగా భావిస్తారు. దాదాపు ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో గురక పెట్టినప్పటికీ, కొందరికి ఇది దీర్ఘకాలికంగా ఉంటుంది. సరళంగా చెప్పాలంటే రోజువారీ గురక అనారోగ్యకరం. బరువు తగ్గడం, పడుకునే ముందు మద్యం సేవించకపోవడం వంటి జీవనశైలి మార్పులు గురకను నివారించడంలో సహాయపడతాయి. గురకను తగ్గించడంలో సహాయపడే వివిధ మందులు, శస్త్రచికిత్సలు కూడా ఉన్నాయి. నిజానికి గురక తీవ్రమైన అనారోగ్యానికి సంకేతమనే విషయం చాలా మందికి తెలియదు.

గురక వల్ల స్ట్రోక్ వచ్చే ప్రమాదం 46 శాతం పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో గురక ధమనుల్లో రక్త ప్రవాహానికి ఆటంకం కలిగించవచ్చు. కాబట్టి సరైన సమయంలో వైద్యులను సంప్రదించడం బెటర్.

క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ ప్రకారం ఎక్కువగా గురక పెట్టే వారికి గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఇటీవలి అధ్యయనాలు చెబుతున్నాయి. బాత్రూమ్‌కి వెళ్లడానికి రాత్రికి రెండు లేదా అంతకంటే ఎక్కువ సార్లు మేల్కొనడాన్ని నోక్టురియా అంటారు. ఇది పురుషులు, స్త్రీలలో గురకతో కూడా సంబంధం కలిగి ఉంటుంది.

సాధారణంగా గురక వచ్చే వారితో పోల్చితే గురక లేనివారి కంటే మధుమేహం వచ్చే అవకాశం 50 శాతం ఎక్కువ. స్లీప్ అప్నియా టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది.

నిద్రపోతున్నప్పుడు గురక పెట్టే వ్యక్తులు లేదా ఇతర శ్వాస సమస్యలు ఉన్నవారు అధిక రక్తపోటుకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అలాగే ఎంత చిన్నవారైతే అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం అంత ఎక్కువగా ఉంటుంది.



# సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సీపీఐ 99 వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సీపీఐ విశాఖ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగాయి. సీపీఐ సీనియర్ నాయకులు, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి సిహెచ్ మసేన్ సీపీఐ జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం పోరాటం చేసిన పార్టీ సీపీఐ, పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు అనేక పోరాటాలు నిర్వహించిందని, నూతన ఆర్థిక సరళీకృత విధానాల వల్ల నేడు అనేక సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని, నూతన ఒరవడిని అందిపుచ్చుకోవడంలో వెనకబడి ఉన్నాయన్నారు. పార్లమెంటులో ప్రజాసమస్యలు, నిరుద్యోగం వంటి సమస్యలపై చర్చలు జరగడంలేదని, బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తోందని, ఎన్నిక కమిషన్, మీడియా, కార్పొరేట్ సంస్థలు, కాగ్ వంటి ప్రధాన సంస్థలను మోదీ గుప్పిట్లో ఉన్నాయని అన్నారు. రాజ్యాంగ బద్ద సంస్థలను నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యంగా, భారతీయ శిక్షా సంస్కృతి చట్టాలను మార్చారని, ప్రజాపక్షం పట్ల నిలబడి పోరాడితే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, ఆదివాసీ, మైనార్టీ ఇలా అన్నివర్గాల వారిపై మతతత్వ దాడులు అధికమయ్యాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ పటిష్టం చేయడంతో పాటు నూతన తరాలను ప్రోత్సాహిస్తూ ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు.

సీపీఐ రాష్ట్ర నాయకులు చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ ప్రజా సేవపేరుతో వ్యాపారం జరుగుతోంది. ఆయుధాలు, మారకద్రవ్యాల వ్యాపారం జరుగుతోందని, మూడోది మతతత్వం, నాలుగోది రాజకీయాలు దేశంలో నడుస్తున్నాయని అన్నారు. నాడు కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు సమయంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో ఇంకా వెనుకబడి ఉన్నామని గుర్తు చేశారు. వేతన సవరణ చేసి కార్మికులకు జీతాలు పెంచాల్సిన పాలకులు బటన్లు నొక్కడం ఏమిటని, ఎవ్వరి డబ్బులు ఎవ్వరికి వేస్తున్నారు అని ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని పాటించే బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. మోదీ దళారీ కాకపోతే ఆదాని, అంబానీ ఆస్తులు ఎలా పెరిగాయని, దేశంలో సంపద సృష్టి పడిపోతే కేవలం వారి ఆదాయం పెరగడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పతాకావిష్కరణ చేసిన మసేన్ మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భావం నుంచి నేటివరకు కర్షక, బడుగు, బలహీన, కార్మిక పక్షాన నిలబడి పోరాటం నిర్వహిస్తోందని అన్నారు.

జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ ఎ జె స్టాలిన్ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా సీపీఐ ఆవిర్భావం జరిగిందని అన్నారు. దేశాభివృద్ధిలో సీపీఐ కీలక పాత్ర పోసించిందని అన్నారు. 99 సంవత్సరాలో పారిశ్రామిక అభివృద్ధి లో సీపీఐ కీలక పాత్ర పోషించిందని, మార్క్సిజం పట్ల నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఉండాలని, నేడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పార్లమెంటులో జరిగిన భద్రత వైఫల్యం ఉదంతం అద్దం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు నేటి యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

ఎ పి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల మాట్లాడుతూ ప్రజాసమస్యల పట్ల మమేకమై వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనకు చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధికి ప్రజాసంఘాలు బలోపేతం చేయాలని, ప్రతి శాఖ పరిధిలో మూడు ప్రజా సంఘాలను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు.

ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంలో పడ్డాయని, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజాపక్ష పాలన అని అధికారం చేపట్టి నేడు ప్రజల నడ్డి విరుస్తూ పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వ అసమర్థ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఈ సభలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, కె. సత్యనారాయణ, ఆర్ శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, జి. రాంబాబు, ఎం.మన్మధరావు, సి.ఎస్.క్షేత్రపాల్, తదితరులతో పాటు పలువురు సమితి సభ్యులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

### సేవ్ సాయిల్ కై పరుగు పెడుతున్న శర్మ అందరికి ఆదర్శం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భూమిని కాపాడండి అనే నినాదంతో 65 ఏళ్ల సుబ్రహ్మణ్య శర్మ 33 కిలోమీటర్లు ఒంటరిగా పరుగు పెట్టడం అభినంద నీయం అని తెలిపారు.

అగనంపుడి బ్రిడ్జి పై పెద్ద బ్యానర్లు ధరించి పరుగు తీస్తున్న శర్మను చూసి అదే మార్గంలో వెళ్తున్న ఆడారి కిషోర్ కుమార్ ఆయన సంకల్పాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి పెద్దల సంకల్పం నేటి యువతరానికి స్ఫూర్తి అన్నారు. వాతావరణాన్ని, పంచ భూతాలను కలుషితం చేయవద్దని పిలుపునిచ్చారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

(1) టెండరు ప్రకటన నెం. VSKP-ELECTG-23-24-WC-25, తేది: 07.12.2023

పని పేరు: వాల్తేరు డివిజన్ నందు వేర్వేరు ప్రదేశములు వద్ద రూఫ్ టాప్‌పైన సోలార్ గ్రిడ్ ప్లాంట్ ఏర్పాటు చేయుట.

టెండరు విలువ: ₹ 1,44,39,999.33, బిడ్ సెక్యూరిటీ: ₹ 2,22,200/-.

(2) టెండరు ప్రకటన నెం. VSKP-ELECTG-23-24-WC-26, తేది: 07.12.2023

పని పేరు: విశాఖపట్నం (ఫేజ్-II) వద్ద పంపు హౌస్‌ల ఆటోమేషన్.

టెండరు విలువ: ₹ 36,28,498.4, బిడ్ సెక్యూరిటీ: ₹ 72,600/-.

పూర్తి చేయు కాలం: 120 రోజులు (ప.నెం. 1 కొరకు) మరియు 90 రోజులు (ప.నెం. 2 కొరకు)

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 12.01.2024న 1330 గంటలు.

టెండరు తెరచు తేదీ మరియు సమయం: 12.01.2024న 1600 గంటలు.

టెండరు డాక్యుమెంట్లు పూర్తి వివరములు లభించు వెబ్‌సైట్ www.ireps.gov.in.

జారీ చేయబడే ఏదైన సవరణ కొరకు టెండరుదారులు వెబ్‌సైట్‌ను గమనించగలరు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (G) వాల్తేరు

PR-927/O/23-24


## జర్నలిస్టులకు రైల్వే పాస్‌లు పునరుద్ధరించండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో జర్నలిస్టులకు రైల్వే పాస్ పునరుద్ధరించేలా చేయాలని మాజీ కేంద్రమంత్రి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరిని ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ రిపోర్టర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరపు సాంబశివ నాయుడు కోరారు.

ఉయ్యూరు మండలం రాజు పేట గ్రామానికి విచ్చేసిన సందర్భంగా మంగళవారం ఉదయం ఆమెను కలిసి వినతి పత్రం ఇచ్చారు.

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ద్వారా రాష్ట్రంలో జర్నలిస్టులకు రైల్వే పాస్ పునరుద్ధరింప చేయాలని ఆమెను కోరారు.

ఈ సందర్భంగా పురందరేశ్వరిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

రత్న గ్రూప్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకులు చిందా వెంకటేశ్వర్లు రాజు, డైరెక్టర్ చిందా కళ్యాణ రాజులతో కలిసి ఆమెను సాంబశివ నాయుడు సత్కరించారు.

## "మహిళా శక్తి ఆటో రిక్షా"లతో 'ఉన్నతి'

### డిప్యూటీ సీ.ఎం. ముత్యాల నాయుడు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉన్నతి పథకంలో మహిళా సంఘాల ద్వారా పేద ఎస్సీ మహిళలకు వడ్డీలేని ఋణాలనిచ్చి, వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించడం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గొప్ప ఆలోచన అని డిప్యూటీ సీ.ఎం., పంచాయతీరాజ్ మంత్రి బూడి ముత్యాల నాయుడు చెప్పారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద డి.ఆర్.డి.ఎ. ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఎం.పీ. డాక్టర్ బి.వి. సత్యవతితో కలిసి జిల్లాలోని 9మంది ఎస్సీ మహిళలకు ఆటోలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న పథకాలను అందరూ వినియోగించుకోవాలని కోరారు.

లబ్ధిదారులు వాహనం ఖరీదులో 10 శాతం చెల్లించగా మిగిలిన 90 శాతం ఋణము వడ్డీ లేకుండా మంజూరు చేసారన్నారు. జిల్లాలో 9 మండలాలలో 9 మంది మహిళా సభ్యులకు రూ.24,60,524లు అప్పుగా ఒక్కొక్కరికి రూ. 3,03,434ల విలువైన ఆటోను ఇవ్వడం జరిగిందన్నారు. దీనివలన మహిళలు ఆర్థిక స్వావలంబన కలిగి తమ కుటుంబానికి తమ వంతు సహకారం అందిస్తారని చెప్పారు. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు వాటిలో ఉన్నతిలో మహిళా సాధికారతకు మహిళా శక్తి పథకంలో జిల్లాలోని మాడుగుల పాయకరావు పేట కోటవురట్ల సబ్బవరం మునగపాక అచ్యుతాపురం బుచ్చయ్యపేట రావికమతం చోడవరం మండలాల మహిళలు ముందుకు వచ్చి ఆటోలు తీసుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎంపీ సత్యవతి రిబ్బను కత్తిరించగా డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు జెండా ఊపి ఆటోలను ప్రారంభించారు. మహిళా డ్రైవర్లు ఆటోలను నడిపి చూపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, డి ఆర్ డి ఎ పీడీ శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఏపీడి డైజీ తదితరులు పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవి సూపర్ హిట్ యాక్షన్ డ్రామా ఇంద్ర, 8 ఏళ్ల తర్వాత మళ్లీ మీ జీ సినిమాలులో!

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీలో అత్యంత ఆదరణ గల ఛానల్జీ సినిమాలు. వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ సినిమాలు మెగా బ్లాక్‌బస్టర్ మూవీ 'ఇంద్ర'తో ఈ ఏడాదిని ఘనంగా ముగించేందుకు సిద్ధమైంది. ఇంద్ర సినిమా విడుదలై ఘనవిజయం సాధించి రెండు దశాబ్దాలు పూర్తయింది. మెగాస్టార్ చిరంజీవి, సోనాలీ బింద్రేజంటగా నటించిన యాక్షన్ ఎంటర్ టైనర్ ఇంద్ర, డిసెంబర్ 30న సాయంత్రం 6 గంటలకు జీ సినిమాలులో!

ఎనిమిదేళ్ల తర్వాత మరోసారి బుల్లితెర ప్రేక్షకులను అలరించేందుకు జీ సినిమాలు వేదికగా ఇంద్ర సినిమా ప్రసారం కానుంది. వైజయంతీ మూవీస్పమర్పణలో బి.గోపాల్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ప్యాక్డ్ చిత్రం ఇంద్ర. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విడుదలై 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మరోసారి మెగాస్టార్ చిరంజీవి, సోనాలి బింద్రే నటించిన ఈ సినిమా విజయాన్ని అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. రాయలసీమలోని ఫ్యాక్షన్ కుటుంబానికి చెందిన టాక్సీ డ్రైవర్ శంకర్ నారాయణ్ (చిరంజీవి పాత్ర) చుట్టూ తిరిగే ఈ చిత్రం సమాజంలో లోతుగా పాతుకుపోయిన శత్రుత్వాన్ని అంతం చేసేందుకు ఇంద్రసేనా రెడ్డి చేసిన ప్రయత్నాన్ని చక్కగా చూపిస్తుంది. క్షమాగుణం, సయోధ్య, న్యాయం యొక్క ఇతివృత్తాలే ప్రధాన కథాంశంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమా మూడు నంది అవార్డులను గెలుచుకుంది.ఉత్తమ నటుడి విభాగంలో చిరంజీవి ప్రశంసలు అందుకున్నారు.




## జిల్లాలో రక్తహీనతను పూర్తిగా తగ్గించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో గుర్తించిన ప్రాంతాలలో బాలలు గర్భిణులలో గమనించిన రక్తహీనతను పూర్తిగా తగ్గించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఈ విషయమై ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యాక్టర్ మాట్లాడుతూ పౌష్టికాహారం తగిన మందులు వాడటం మూలంగా చాలాచోట్ల ప్రగతి కనిపించిందన్నారు. రక్తహీనతకు గల కారణాలు, ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులు, అవగాహన మొదలైనవన్నీ క్రోడీకరించి ప్రణాళికాయుతంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. రక్తహీనతతో ఉన్న గర్భిణులు, బాలికలు, చిన్నపిల్లలపై చేపట్టిన చర్యలు ఎంతవరకు ఫలవంతమైనవో గుర్తించాలన్నారు. స్వస్థత హెచ్చుతగ్గులను తులనాత్మకంగా బేరీజు వేసుకొని వారికి తగిన అవగాహన కలిగించాలన్నారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఏ.హేమంత్, సిపిఓ జి.రామారావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, డీఈవో వెంకట లక్ష్మమ్మ, డాక్టర్లు ఎంఈఓలు, సిడిపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## తులసిరావు విగ్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** తులసిరావు డైరీ రంగాన్ని ప్రగతి పథములో నడపడంతో పాటు రైతులకు ఎంతో మేలు చేశారని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె నాతయ్యపాలెం విశాఖ డైరీ జంక్షన్ వద్ద స్వర్గీయ మాజీ విశాఖ డైరీ చైర్మన్ ఆడారి తులసిరావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కేంద్ర పశువర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్షోత్తం రూపాల, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్లమెంటు సభ్యులు జీవీఎల్ నరసింహులు, గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, వైఎస్ఆర్సిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్, ఉత్తర నియోజవర్గ సమన్వయకర్త మరియు నెట్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, కార్పొరేటర్లు కాకి గోవింద రెడ్డి, అనిల్ కుమార్ రాజు, పివి సురేష్, మిలీనియం శ్రీధర్, ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు, విశాఖ డైరీ అధికారులు, సిబ్బంది తదితరులతో కలసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ తులసీ రావు డైరీ రంగానికి ఎనలేని సేవ చేశారని, విశాఖ డైరీని ప్రగతి పథంలో నడిపించాలని, రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేశారని, వారి సంక్షేమతో పాటు ఆరోగ్యం కొరకు కృషి ఆసుపత్రి నెలకొల్పి ఎంతోమంది పేద రైతులకు ఉచితంగా వైద్య సదుపాయం అందించారని తెలిపారు. 1977లో విశాఖ డైరీకి ఎన్నికై 35 సంవత్సరాలు డైరీ చైర్మన్‌గా తన సేవలను కొనసాగించి, డైరీని లాభాల బాటలో నడిపించారని తెలిపారు. 50 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న విశాఖ డైరీని 10 లక్షల లీటర్లకు పెంచిన ఘనత తులసిరావుదేనని మేయర్ కొనియాడారు. అంతేకాకుండా సహకార అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గాను, గ్రామ సర్పంచ్ గాను పనిచేశారని తెలిపారు.



## 7వ వార్డులో అవంతి గడపగడపకు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 7వ వార్డులో పర్యటనకు వెళ్ళినప్పుడు స్థానికులు గతంలో జరగని పనులు వలన స్థానికంగా నివాసం ఉండే మేము చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాం మా సమస్యలు పరిష్కారం చేయండి అని అవంతితో చెప్పుకోవడం జరిగింది.

ఈరోజు జివియంసి సాధారణ నిధుల అంచనా విలువ 1కోటి 28 లక్షలు రూపాయలతో 7వ వార్డు ఆర్టీసీకోలనీలో సిసి రోడ్లు - మరియు డ్రైనేజీ వ్యవస్థ - రక్షణ ప్రహరీ నిర్మాణానికి మరియు వాంబేకోలనీ లో సామాజిక భవనం నిర్మాణానికి మాజీ మంత్రి భీమిలి నియోజకవర్గం శాసన సభ్యులు అయిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేయడం జరిగింది.

గత ఎళ్ళ నుంచి ఉన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికై శ్రీకారం చుట్టిన అవంతికి స్థానికులు సంతోషంతో దన్యవాదాలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ధనుర్మాసం సందర్భంగా స్థానిక గవరపాలెం దిబ్బ వీధి శ్రీ సీతారామ ఆలయంలో బుధవారం ప్రార్థన తరంగణి సంఘం సభ్యులు, భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. సుమారు 50 మంది సభ్యులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దాడి భాస్కరరావు ప్రార్థన తరంగిణి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## నూకాంబిక అమ్మవారి ఆలయ రాతి కట్టు పనులు ప్రారంభం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ రాతి కట్టును అనకాపల్లి వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్, దాడి జయవీర్, దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి బండారి ప్రసాద్, అర్చకులు వీరికి ఘనంగా స్వాగతం పలికారు. తదుపరి అమ్మవారి దేవస్థానంలో నిర్మించిన నూతన ఉత్సవ మండపాన్ని దేవస్థానం మొట్టమొదటి చైర్మన్ వంశీకుల వారసులైన దాడి సన్యాసి రత్నం మరియు వీరి కుమారులు దాడి నారాయణస్వామి, డాక్టర్ దాడి అప్పా రావు నాయుడులతో కలిసి అనకాపల్లి వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొణతాల నీలిమ భాస్కర్, పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, డాక్టర్ కే.విష్ణుమూర్తి, జాజుల రమేష్, బొడ్డేడ శంకర్రావు, దేవస్థానం పాలకవర్గ సభ్యులు, కే.యం నాయుడు, శిలపరశెట్టి బాబి, కాండ్రేగుల కృష్ణ అప్పారావు, కోరిబిల్లి ఆరుద్ర, బొడ్డపాటి చిన్న రాజారావు, ఆళ్ళ నాగేశ్వరరావు, బొడ్డేడ శివ, కర్రి అప్పాజీ, వై శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## గురుద్వారాలో పురుషోత్తమ్ రూపాలా

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖల మంత్రి పురుషోత్తమ్ రూపాలా తమ విశాఖ అధికారిక పర్యటనలో భాగంగా గురుద్వారాను సందర్శించి వీర్ బాల దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సిక్కుల గురువు, గురు గోవింద్ సింగ్ కుమారులు, మొగలుల చేతిలో ప్రాణార్పణం కావించిన రోజును వీర్ బాల్ దివస్‌గా ప్రధాని మోదీ ప్రకటించి ఏటా డిసెంబరు 26 న నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి గురుద్వారాలో మాట్లాడుతూ పసి ప్రాయంలోనే తమ ధర్మం ప్రాణాలకన్నా గొప్పదని ప్రకటించి మొగలుల హింసకు బలయిన బాలలు ఇద్దరూ ధన్యులన్నారు. మరుగున పడిన ఇలాటి ఎన్నో త్యాగాల ఫలితంగానే మనదేశంలో పురాతన ధర్మం నిలచి ఉందన్నారు.

ఎంపి జీవీఎల్ నరసింహారావు, విశాఖ గురుద్వారా సత్ సంగత్ అధ్యక్షుడు డాక్టర్ డిఎస్ ఆనంద్, నగర బిజెపి అధ్యక్షుడు రవీంద్ర మేడపాటి, విశాఖ ఉత్తర నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

# 28 నుంచి మంత్రి బొత్స జిల్లా పర్యటన

**విజయనగరం:** రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి డిసెంబరు 28న ఉదయం జిల్లాకు చేరుకుంటారు. ఆరోజు మధ్యాహ్నం 3-00 గంటలకు గుర్ల మండలం కొండగండ్రేడు చేరుకొని గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రం భవనాలను, తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారు. ఇళ్లపట్టాల పంపిణీ చేపట్టడం తోపాటు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు రామలింగాపురం చేరుకొని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, సొసైటీ గోడౌన్, సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్ర భవనాలను ప్రారంభించి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు.

29న ఉదయం 10.30కు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4.00 గంటలకు గరివిడి మండలం వెదుళ్లవలసలో బి.టి.రోడ్డు ప్రారంభం, విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం అక్కడ బహిరంగసభలో ప్రసంగిస్తారు.

30న మెరకముడిదాం మండలం శాతంవలసలో పెరుమాలి వరకు నిర్మించిన రోడ్డును, రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయం భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.

31న ఉదయం 10.30 గంటలకు బొబ్బిలి మండలం పక్కిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విజయనగరం చేరుకుంటారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

## ఐదుగురు అమలాపురం వాసుల మృతి



**టెక్సాస్:** అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. టెక్సాస్ హైవేలో జరిగిన ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు మృతిచెందినట్లు తెలుస్తోంది.

జాన్సన్ కౌంటీలో ఉన్న 67వ నంబరు హైవేపై మినీవ్యాన్‌ను ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అమలాపురం వాసులుగా తెలుస్తోంది. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి పరిస్థితి ఎలా ఉందన్నది ఇంకా తెలియరాలేదు.

ఈ ప్రమాదంపై తానా సభ్యులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అవసరమైన సాయం అందిస్తామని తెలిపారు. అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ సూచన మేరకు తానా ట్రెజరర్ అశోక్ కొల్లా, ఫౌండేషన్ ట్రెజరర్ పోలవరపు శ్రీకాంత్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

# ఇండియన్ రైల్వేకు ఇది న్యాయమేనా?




సాధారణ, మధ్య తరగతి ప్రయాణికులపై భారతీయ రైల్వే చిన్నచూపు చూస్తోంది. పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్, ప్రత్యేక రైళ్లుగా మార్చి వారి నుంచి ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు వసూలు చేస్తోంది. ఐసీఎఫ్ బోగీల స్థానంలో ఎల్‌హెచ్‌బీ బోగీలు ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ స్లీపర్ బోగీల సంఖ్యను రోజురోజుకు తగ్గిస్తోంది. అన్ని రైళ్లల్లో 10కిపైగా స్లీపర్ బోగీలు ఉండేవి. వాటిని వేళ్లపై లెక్కపెట్టే సంఖ్యకు రైల్వే తెచ్చింది.

70శాతం రైళ్లల్లో స్లీపర్ బోగీలు కేవలం 3 నుంచి 5 వరకే ఉంటున్నాయి. దీంతో అవి సరిపోక జనరల్ బోగీల్లా ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోంది. 22 బోగీలున్న ఒక రైలును పరిశీలించగా అందులో ఏసీ బోగీలు 14 ఉన్నాయి. మిగిలిన 8 బోగీల్లో 3 స్లీపర్, ఒకటి పోస్టల్ డిపార్ట్‌మెంట్, ఒకటి ప్యాంట్రీ కార్ కాగా, ఒకటి జనరేటర్ కమ్ గార్డు బోగీ, మరొకటి జనరల్, ఇంకోటి దివ్యాంగులతో పాటు పార్సిల్స్‌కు కేటాయించారు.

దాదాపు 1200 నుంచి 1700 కిలో మీటర్ల దూరం ప్రయాణించే రైలులో స్లీపర్ బోగీల సంఖ్య కేవలం నాలుగు. ఎక్కువ దూరం ప్రయాణించే దాదాపు ప్రతి రైలుకు స్లీపర్ బోగీలను 3కు తగ్గిస్తున్నారు. వాటి స్థానంలో రెండు థర్డ్ ఏసీ ఎకానమి బోగీలను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్లీపర్ బోగీల్లో సీట్లు లభించనివారు వాటిల్లోకి ఎక్కుతుండటంతో కాలు పెట్టడానికి కూడా ఖాళీ లేకుండా ప్రయాణిస్తున్నాయి.

ఒకవేళ ఖాళీ లభించినా అంత దూర ప్రయాణాన్ని ఒంటికాలిపై నిలబడి లేదంటే ప్రయాణికుల మధ్య కిక్కిరిసి పయనించాల్సి వస్తోంది. గతంలో ఉన్నట్లుగానే స్లీపర్ బోగీలను అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే సిటిజన్స్ ఫోరమ్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాలు ముట్టడించిన అంగన్వాడీలు

● సమస్య పరిష్కరించని పక్షంలో సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తాం ● ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేసిన ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అంగన్వాడీలు ఎన్నో ఏళ్ల నుండి ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదని ఏఐటియుసిరాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. అంగన్వాడీలు తమ సమస్యలపై 16 రోజుల నుండి ఆందోళన చేస్తున్న ప్రభుత్వ మొండి వైఖరిగా వ్యవహరిస్తుందని దీనికి నిరసనగా బుధవారం అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు బీశెట్టి సత్యవతి ఇంటిని, మంత్రి అమర్ కార్యాలయాన్ని అంగన్వాడీలు ముట్టడించి ఎంపీకి వినతిపత్రం సమర్పించారు. అంగన్వాడీలకు మద్దతు తెలిపి ఈ సందర్భంగా కోన లక్ష్మణ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడి కార్యకర్తల సమస్యలు పరిశీలించామని చెబుతూ ప్రధాన సమస్య అయిన వేతనం, గ్రాట్యుటీ ప్రకటించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని, పరిష్కరించని పక్షంలో సీఎం క్యాంప్ ఆఫీసు, రాష్ట్ర సచివాలయమును ముట్టడిస్తామని లక్ష్మణ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత రాక్షసత్వంగా వ్యవహరిస్తూ అంగనవాడీల సమస్యలను పరిష్కరించకుండా బటన్లు నొక్కుకుంటూ కాలం వెళ్లబుచ్చుకుంటోందని, ఎద్దేవా చేశారు. ప్రజాప్రతినిధులకు కావలసిన వేతనాలను, సదుపాయాలను కల్పిస్తున్న ప్రభుత్వం తక్కువ వేతనంతో




ఎంతో శ్రమ చేస్తున్నారు అంగన్వాడీలను తక్కువ చూస్తుందన్నారు. రాబోయే ఎన్నికలలో గద్దె దించుతామని లక్ష్మణ హెచ్చరించారు.

ఎంపీ డాక్టర్ బి.వి. సత్యవతి మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళి సమస్య పరిష్కారం కృషి చేస్తామని అన్నారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు శంకర్, కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు వై.ఎస్ భద్రం, ఐఎఫ్‌టియు నాయకులు కోన మోహన్, అంగన్‌వాడి సంఘం నాయకులు నాగ శేషు, కాసులమ్మ, కృష్ణ వేణి, కొండమ్మ అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

# హరిత విశాఖే ధ్యేయంగా మిద్దె తోటలు పెంచుదాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ నగరాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు మిద్దె తోటల పెంపకం చాలా అవసరమని, ఆ దిశగా జివిఎంసి విశాఖ నగర ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టినందున నివాసితులు సహకరించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె జివిఎంసి 2వ జోన్ 13వ వార్డులో మిద్దె మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమంలో వార్డ్ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ఎకో గ్రీన్ అంశంపై టెర్రస్ గార్డెన్స్ అభివృద్ధి కొరకు ప్రతీ అపార్టుమెంట్లపై, భవనాలపై, గేటెడ్ కమ్యూనిటీల వద్ద మిద్దె తోటలు ఏర్పాటు చేసుకునేందుకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ మిద్దె తోటల పెంపకానికి మొక్కల పంపిణీ కార్యక్రమంలో ప్రజలకు నిత్యవసరంగా ఉపయోగపడే 12 రకాల విత్తనాలు, 12 రకాల నారు మొక్కలను అందించడంతో పాటు అవి పెంచే కార్యక్రమంపై అవగాహనను అధికారులు కల్పించారని ఆమె తెలిపారు. వీటిల్లో ముఖ్యంగా నిత్యవసరంగా ఉపయోగపడే కాయగూరలు, ఆకుకూరలు విత్తనాలు ఉన్నాయని తెలిపారు. మన నగరం లో 35 శాతం పచ్చదనం కలిగి ఉందని దీనిని 50 శాతం పెంచాలని, అంతేకాకుండా విశాఖలో ఈ మిద్దె తోటల వలన పొల్యూషన్, కాలుష్యంతో పాటు వాతావరణంలోని వేడి తగ్గించుకోవచ్చని ఆమె తెలిపారు. "వృక్షో రక్షతి రక్షితః" అంటే మనం వృక్షాలను రక్షిస్తే అవి తిరిగి మనల్ని రక్షిస్తాయని తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ టెర్రెస్‌లపై విరివిగా మొక్కలు పెంచి మిద్దె తోటల నిర్వహణ చేపట్టాలని ఆమె కోరారు.

ఈ కార్యక్రమంలో రెండవ జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) డి.లక్ష్మి, డి.పి.ఓ ప్రసాద్, ఎస్.ఆర్.యు మేనేజర్ శ్రీనివాస్ రాజమణి, గ్రీన్ క్లైమేట్ జె.వి.రత్నం, పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ప్రాంత అభివృద్ధే తమ లక్ష్యం

## జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం



'వాణిజ్యం, ఉపాధే' లక్ష్యంగా ఉత్తరాంధ్ర రైతులతో పల్సస్ సంస్థ అధినేత గేదెల శ్రీనుబాబు సమావేశమయ్యారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఉత్తరాంధ్ర రైతులతో చర్చించారు. నీటి వినియోగాన్ని పెంచటం ద్వారా ఉత్తరాంధ్ర సాగు విస్తీర్ణాన్ని 12 లక్షల ఎకరాల నుండి 30 లక్షల ఎకరాలకు పెంచవచ్చన్నారు. వ్యవసాయ రంగంలో 'వాణిజ్యం, ఉపాధే' లక్ష్యంగా సరికొత్త చర్చకు ఉత్తరాంధ్ర వేదికైంది. ప్రస్తుతం ఉన్న 25 టీఎంసీల నుంచి 80 టీఎంసీల నీటి వనరుల వినియోగాన్ని పెంపొందించడమే తమ లక్ష్యం అన్నారు. రైతులు వాణిజ్య పంటల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్రలో సుమారు 30 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే, కేవలం 12 లక్షల ఎకరాలు మాత్రమే సాగులో ఉందన్నారు. నీటి కొరత కారణంగా 18 లక్షల ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయని పేర్కొన్నారు. సమృద్ధిగా నీటి వనరులు ఉన్నప్పటికీ, కాలువలు లేకపోవడం వల్ల 200 టీఎంసీల నీటిని వినియోగించుకోవల్సిన వాళ్ల కేవలం 25 టీఎంసీల నీటికి పరిమితమయ్యారని తెలిపారు.

జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వ్యవసాయ పురోగతికి అడ్డుతగిలే క్లిష్టమైన సమస్యలను ప్రస్తావించారు గేదెల శ్రీనుబాబు. వ్యవసాయంతో పాటు ఆహార ఆధారిత పరిశ్రమల ద్వారా లక్షల ఉద్యోగాలను సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఆర్థిక స్థితిగతులను పునర్నిర్మించడం, స్థిరమైన భవిష్యత్తును నిర్ధారించడంపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. వాణిజ్య పంటల సాగులో స్థానిక రైతులకు, వారి పిల్లలకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా దేశవ్యాప్తంగా ఉత్పత్తులను విక్రయించడానికి వారి పిల్లలకు కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ అవసరమని చెప్పారు. యూరోపియన్ వ్యవసాయ సాంకేతికతలను అవలంభించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పండించిన వస్తువులను ఎగుమతి చేసే లక్ష్యంతో యూరోపియన్ బిజినెస్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

ఈ ప్రయత్నంలో భాగంగా స్థానికంగా ఉండే విశ్వవిద్యాలయాన్ని, ఒక పరిశోధనా సంస్థను, సాంకేతికత బదిలీ కేంద్రంతో పల్సస్ సంస్థ భాగస్వామ్యం కుదుర్చుకుని పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రయోగం ఆంధ్రప్రదేశ్ రైతులకు అనేక అవకాశాలను అందజేస్తుంది అని చెప్పారు. తద్వారా వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది అన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డ్రోన్ సాంకేతికతతో పాటు అధునాతన వ్యవసాయ పద్ధతులను కలిగి ఉంటుందని పేర్కొన్నారు. జీపీఎస్-ఆధారిత ఫీల్డ్ మ్యాపింగ్, రిమోట్ సెన్సింగ్ సహా పంట దిగుబడిని ఆప్టిమైజ్ చేయడానికి యూరోపియన్ వ్యవసాయ పద్ధతులపై మన రైతులకు శిక్షణ ఇచ్చి ముందుకు సాగాలన్నారు. 50,000 మంది రైతులు వారి పిల్లలు శ్రీకాకుళం, రాజాంలో జరిగిన ఈ ఈవెంట్‌లలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సాంకేతికంగా అభివృద్ధి చెందడానికి, ఐక్యంగా ముందుకు సాగటానికి ఎంతగానో తోర్పడుతుందని తెలిపారు. అలాగే ఉత్తరాంధ్రకు మంచి భవిష్యత్తును అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గిరిజనుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు దిలీప్ మృతి

# అంబులెన్సు ఏర్పాటు చెయ్యలేని వైసిపి ప్రభుత్వం





**పాడేరు/పెదబయలు, (విశాఖ సమాచారమ్):** మండలం వానభంగి పంచాయతీ ఉక్కుర్బా గ్రామానికి చెందిన 1వ తరగతి చెదువుతున్న దిలీప్‌కు జ్వరం రావడం తో వారి తల్లి తండ్రులు మంగళవారం పాడేరు జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. అయితే మలేరియా ఎక్కువ అయిందని చెప్పడంతో ఉదయం 3గంటల సమయానికి కెజిహెచ్‌కు తరలిస్తుండగా ఘాటీ మార్గ మధ్యలో మరణించారు. మళ్ళీ పాడేరు జిల్లా ఆసుపత్రికి మృతదేహన్ని తీసుకురాగా, హాస్పిటల్ సిబ్బంది అంబులెన్స్ ఏర్పాటు చెయ్యకపోవడంతో మోటార్ బైక్‌తో వారి స్వగ్రామం అయిన ఉక్కుర్బా గ్రామానికి తల్లితండ్రులు తీసుకువెళ్లారు. విషయం తెలుసుకొన్న టిడిపి డివిజన్ నాయకులు పాండురంగ స్వామి ఆ గ్రామానికి చేరుకొని దిలీప్ మృతదేహని నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పారమర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా పాండురంగస్వామి మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించడంలో జిల్లా ఆసుపత్రి సిబ్బంది విఫలం అయ్యారని, మలేరియా జబ్బుకి కూడా ఆసుపత్రిలో మందులు ఉన్నాయో లేదో తెలియని పరిస్థితి ఉందని, చనిపోయిన మృతదేహనికి కనీసం అంబులెన్సు ఇవ్వకపోవడం కేవలం వైసిపి ప్రభుత్వం తప్పిదమే అని ఆదివాసీల ఆరోగ్యం పట్ల, మరణాల పట్ల వైసిపి ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది అనడంలో ఇదే నిదర్శనం అని, చనిపోయిన తరువాత కూడా అంబులెన్సు లేకపోవడం ఆ కుటుంబాన్ని ఎంతో మనోవేదనకు ప్రభుత్వమే గురి చేసిందని రాష్ట్రములో ప్రభుత్వ అసమర్ధ పాలన వల్లే ఆదివాసీ ప్రజలకు కష్టాలు అని అన్నారు. వారితో పాటు పెదబయలు మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి పాంగి నాగేశ్వరరావు, మురళి, అర్మ రామారావు, పూజారి బొంజుబాబు, సోమన్న తదితరులు వెళ్లి నివాళులు అర్పించారు.

# ఘనంగా అయోధ్య అక్షతల, కలశాల శోభాయాత్ర





**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** మండల కేంద్రమైన యలమంచిలి నుంచి అన్ని గ్రామాల ప్రజలకు అయోధ్య శ్రీరాముల వారి అక్షతల కళాశాలను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి అక్షతలు కలశాలతో ప్రతి గ్రామం నుంచి వచ్చిన రామభక్తులు పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి అనంతరం ఊరేగింపుగా వారి వారి గ్రామాల రామాలయాలకు చేరుకున్నారు.

విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, సమరసత సేవా ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అక్షతల పవిత్రత, పంపిణీ విధానం తదితర అంశాలను తెలియజేశారు. వి.హెచ్.పి మండల అధ్యక్షులు కట్టా సత్యనారాయణ, ఆర్ఎస్ఎస్ విశాఖ విభాగ్ సంఘచాలక్ ఆడారి రెడ్డి నాయుడు అక్షతల పంపిణీ కార్యక్రమం గురించి వివరిస్తూ ఈ అక్షతల కలశాలను రామాలయాలలో ఉంచి ప్రతిరోజు రామనామ జపం చేయాలని, జనవరి ఒకటో తేదీ తర్వాత ప్రతి గడపకి అక్షతలు పంపిణీ చేయాలని, గ్రామ రామాలయాల ఆధ్వర్యంలోనే ఈ పని పవిత్రంగా పూర్తి చేయాలని సూచించారు.

జనవరి 22వ తేదీన అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరుగుతున్నందున ఈలోపు రామాలయాల ద్వారా గ్రామాలలో జరగవలసిన భక్తి కార్యక్రమాలను రామ భక్తులందరికీ వివరించారు. మూడు సంవత్సరాల క్రితం అయోధ్య రామాలయం కోసం నిధి సహాయం చేసిన ప్రతి గడపకి, శ్రీరాముల వారి ఆశీస్సులుగా ఈ అక్షింతలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని రామాలయాల నుంచి విచ్చేసిన భక్తులతో పాటు, రామ సేవకులు పడాల శ్రీరాములు, సన్యాసి బాబు, బండి నాగేంద్ర, రాజాన సత్యనారాయణ, మహిళా భజన బృందాలు పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్రా పోటీలకు పకడ్బందీగా ఏర్పాట్లు



**విజయనగరం:** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆమె బుధవారం బొబ్బిలి, రామభద్రాపురం, గజపతినగరం మండలాల్లో పర్యటించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను, ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లలో లోపాలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో బ్యాడ్మింటెన్, పాతబొబ్బిలిలో వాలీబాల్ పోటీలను కలెక్టర్ పరిశీలించారు. రామభద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటెన్, కబడ్డీ పోటీలను, ఆరికతోట నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను, గజపతినగరం మండలం మరుపిల్లి జెడ్‌పి పాఠశాలలో నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటెన్, ఖోఖో పోటీలను కలెక్టర్ తిలకించారు. ఎన్ని రకాల క్రీడలను నిర్వహిస్తున్నారు, ఎంతమంది క్రీడాకారులు పాల్గొంటున్నారు తదితర వివరాలను తెలుసుకున్నారు. త్రాగునీటి సదుపాయం, వైద్య శిబిరాలను, టైమ్ షెడ్యూల్, స్కోరు బోర్డు, స్కోర్ షీట్‌లను పరిశీలించారు. కొన్నిచోట్ల ఏర్పాట్లలో లోపాలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. దానికి తగినట్లుగానే ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. క్రీడా మైదానాలవద్ద నీడకోసం టెంట్లు, కుర్చీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్రీడలు జరుగుతున్నప్పుడే వెంటవెంటనే ఫోటీలను, వివరాలను, లైవ్ స్కోర్‌ను ఆన్‌లైన్లో అప్లోడ్ చేయాలని, ఈ విషయంలో అశ్రద్ధ చూపించవద్దని స్పష్టం చేశారు. క్రీడా మైదానాలవద్ద కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఎక్కడైనా తప్పనిసరి పరిస్థితుల్లో మైదాన్ని మారిస్తే, ఆ విషయాన్ని క్రీడాకారులకు, ప్రేక్షకులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా హోర్డింగులను, ఫ్లెక్సీలు, మస్కట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోటీలను మొక్కుబడిగా కాకుండా, ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా పూర్తిస్థాయి ఏర్పాట్లతో, ఉత్సాహవంతమైన వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ పర్యటనలో బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తాశిల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపిడిఓ పి.రవికుమార్, రామభద్రాపురం ప్రత్యేకాధికారి గోవింద రావు, తాశిల్దార్ సులోచనా రాణి, ఎంపిడిఓ రమామణి, గజపతినగరం ప్రత్యేకాధికారి రమేష్, ఎంపిడిఓ కె.కిశోర్ కుమార్, ఆయా మండలాల ఎంఇఓలు, పిఇటిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తాం**

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఆమె రామభద్రా పురంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో సుమారు లక్షా, 750 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని చెప్పారు. ఇప్పటివరకు మిల్లర్ల నుంచి రూ.105 కోట్లు వరకు బ్యాంకు గ్యారంటీ వచ్చిందని, 1 : 3 నిష్పత్తిలో ధాన్యం కేటాయించడం జరుగుతుందని చెప్పారు. ఇకనుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ కేసును సీబీఐకి అప్పగించాలన్న ఉండవల్లి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఏపీ సీఐడీ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్ పై ఏపీ హైకోర్టు నేడు విచారణ చేపట్టింది.

విచారణ సందర్భంగా 14 మంది ప్రతివాదులు నోటీసులు తీసుకోలేదని పిటిషనర్ కోర్టుకు విన్నవించారు. డోర్ లాక్ (ఇంట్లో ఎవరూ లేకపోవడం), ఇతర కారణాలతో నోటీసులు తిరిగి వచ్చాయని వివరించారు. ఈ కేసుకు సంబంధించిన కొందరు ప్రతివాదులు ఢిల్లీ, మహారాష్ట్రలోనూ ఉన్నారని, వారికి పత్రికా ప్రకటన ద్వారా నోటీసులు ఇస్తామని కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించి మెమో దాఖలు చేయడం జరిగిందని పిటిషనర్ వెల్లడించారు.

వాదనలు విన్న పిమ్మట ఏపీ హైకోర్టు విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.

ఈ కేసులో చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేయగా, ఆయనకు



రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడంతో, ఇటీవలే రాజమండ్రి జైలు నుంచి బయటికి వచ్చారు.

# జగన్ పాలనలో చెప్పేది ఒకటి చేసేది ఒకటి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** చెప్పేది ఒకటి చేసేదొకటి- విశ్వసనీయత లేని జగన్ రెడ్డి 57 నెలల పాలన ప్రజలకు స్పష్టమైందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వర రావు బుధవారం టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు.

ఎత్తుకొని పెంచిన చిన్నాన్నను రాజకీయాల కోసం అతి కిరాతకంగా హత్య చేసిన నేరస్తులను కాపాడుతున్న క్రూరమైన మనస్తత్వం కలిగిన జగన్ రెడ్డి అని, పులివెందుల శాసనసభ్యుడిగా, కడప పార్లమెంట్ సభ్యుడిగా అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలను మోసం చేశారని, స్టీల్‌ప్లాంట్ 2023 డిసెంబర్ నాటికి ప్రారంభమవుతుందని, అన్నమయ్య డ్యాం బాధితులని నెట్టేటి ముంచిన వ్యక్తి జగన్ అని నాగ జగదీష్ ఎద్దేవా చేశారు. సొంత తల్లి విజయమ్మను, చెల్లి షర్మిలను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని, తండ్రి ఆత్మగా పేరుపడ్డ కెవిపి రామచంద్రరావు, నీడగా ఉన్న సూర్యుడు నేడు జగన్ రెడ్డి వెంట లేరని, నమ్మిన ఎమ్మెల్యేలకు ద్రోహం చేశారని, నమ్మి ఓట్లేసిన దళితులు, మైనార్టీలకు ద్రోహం చేసి, సిటిజెన్ బిల్లుకు పార్లమెంట్లో ఓటు వేయించిన ఘనుడిని నాగజగదీష్ అన్నారు. ఎమ్మెల్యేలకు అభివృద్ధి నిధులు కేటాయించుకుండా, వారికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో లబ్ధిదారులు ఎంపికలో ప్రాతినిధ్యం లేకుండా తన సొంత సైన్యంగా వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి ఎమ్మెల్యేల పరువు తీసారని, ఇక సిపిఎస్ రద్దు హామీపై ఉద్యోగ, ఉపాధ్యాయులను నట్టేట ముంచారని, మద్య నిషేధం చేసి ఓట్లు అడుగుతానని నమ్మబలికి మద్యం ఆదాయాన్ని బ్యాంకులకు తాకట్టు పెట్టిన ఘనతకెక్కిన ముఖ్యమంత్రిగా పేరు గాంచారని, నాసిరకం మద్యం పోసి ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారని, విద్యుత్ చార్జీల పెంచనని హామీ ఇచ్చి మాటతప్పి మడం తిప్పి 64 వేల కోట్లు విద్యుత్ భారాలు విద్యుత్ వినియోగదారులపై మోపారని, కరెంటు కోతలు పెట్టారని నాగ జగదీష్ అన్నారు. డాక్టర్ కే కే వి ఏ నారాయణరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ సబ్‌ప్లాన్ నిధులు 1.14 లక్షల కోట్లు దారి మళ్లించారని, 120 సంక్షేమ పథకాలు రద్దు చేశారని, 14లక్షల ఎకరాల అసైన్మెంట్ భూములు కబ్జా చేశారని, బ్యాక్లాగ్ పోస్టులు 1.40 లక్షల భర్తీ చేయకుండా సామాజిక న్యాయం గొంతు కోశారని, నిరుద్యోగ యువతీ యువకులకు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని ప్రభుత్వంలో ఉన్న 2 లక్షల 30 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి నిరుద్యోగులను నమ్మించి ద్రోహం చేశారని, నారాయణ రావు మండిపడ్డారు.

బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలాబాబు ప్రజలను నమ్మించి మోసం చేసి నమ్మకద్రోహం చేసినందుకు వచ్చే ఎన్నికలలో జగన్ని సాగనంపడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని, జగన్‌కి మంగళం పాడడానికి సిద్ధంగా ఉన్నారని నీలబాబు జోశ్యం చెప్పారు.

# శ్రీవారి భక్తులకు శుభవార్త-ఇక సుపథం నుంచి దర్శనం



తిరుమల తిరుపతి దేవస్థానం తన భక్తులకు శుభవార్తను వినిపించింది. అలిపిరి దగ్గర ఉన్న సప్తగోప్రదక్షిణ మందిరంలో జరుగుతున్న శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమంలో పాల్గొనే భక్తులకు కూడా శ్రీవారి దర్శన భాగ్యం కలగనుంది. హోమం టికెట్ కాకుండా రూ.300 అదనంగా చెల్లించిన వారికి సుపథం నుంచి ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకునే వెసులుబాటును కల్పించ నున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వెల్లడించారు.

టీటీడీకి చెందిన రోడ్లు, సంస్థలు ఉన్న ప్రాంతాలు, భక్తులు సంచరించే ముఖ్య ప్రాంతాల్లో కోర్టు ఉత్తర్వులకు లోబడి పారిశుధ్య టెండర్లను కేటాయించ నున్నట్లు భూమన తెలిపారు. హిందూ ధర్మప్రచారంలో భాగంగా దేశంలోని ప్రముఖ పీఠాధిపతులు, మఠాధిపతులతో ఫిబ్రవరిలో తిరుమలలో సదస్సు నిర్వహించ బోతున్నట్లు పేర్కొన్నారు.

తిరుపతిలో టీటీడీకి సంబంధించిన ఆస్తులు 48 శాతం ఉన్నాయని, వీటిపై నగరపాలికకు ఎలాంటి ఆస్తి పన్నును చెల్లించడంలేదన్నారు. హైకోర్టు తుది తీర్పు వచ్చిన తర్వాతే పారిశుధ్య టెండర్లపై ముందుకు వెళతామన్నారు.

తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి, శ్రీకోదండరామస్వామి సత్రాల స్థానంలో రూ.209.65 కోట్ల వ్యయంతో అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాల నిర్మాణానికి టెండర్లను ఆమోదించినట్లు వివరించారు. కొండపైన యాత్రికుల కాటేజీల్లో నివాసముంటున్న పోలీసు సిబ్బందిని ఖాళీ చేయించడం కోసం ప్రస్తుతమున్న పాత పోలీసు క్వార్టర్స్‌ను రూ.2.87 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని, దీనికి సంబంధించిన టెండరు ఖరారుకు భూమన ఓకే చెప్పారు.

# అభ్యంతరాల స్వీకరణ గడువు పెంపు



**విజయనగరం:** ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్స్ అండ్ అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల కమిషన్ గడువు పెంచినట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. డిసెంబర్ 26 వరకు ఉన్న ఈ గడువును జనవరి 12 వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. వారం వారం నిర్వహించే సమావేశంలో భాగంగా బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాజకీయ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫైనల్ పబ్లికేషన్ తేదీని కూడా పొడిగించారని, జనవరి 5కు బదులుగా జనవరి 22 న ఓటర్ల తుది ప్రచురణ ఉంటుందని తెలిపారు. ఈ వారంలో డిసెంబర్ 20 నుండి 26 వరకు ఫారం- 6 లు 855, ఫారం -7 లు 110, ఫారం -8లు 923 మొత్తం 1888 ఫారాలు అందినట్లు తెలిపారు. గడువు పెంచినందున బి.ఎల్.ఓలు మరోసారి చేర్పులను, తొలగింపులను తనిఖీ చేయాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ.వి.ఎం గోడౌన్ తనిఖీ ఉంటుందని, రాజకీయ పార్టీల ప్రతినిధులంతా హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

బూత్ స్థాయిలో స్వీప్ కార్యక్రమాలు జరపాలని, ఈవిఎంల డెమో నిర్వహించాలని, చునావ్ పాఠశాల, పరిశ్రమలలో స్వీప్ కార్యక్రమాలను నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి వారి సోషల్ మీడియాలో ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా తదితర అంశాలను అప్లోడ్ చేయాలని సూచించారు. నివేదికలను ఖచితమైన ప్రోఫార్మలలో ఎన్నికల కమిషన్‌కు పంపడానికి ఐ.టి టీమ్స్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వర రావు, సుధా రాణి, దొర, నూక రాజు, వై.సి.పి పార్టీ ప్రతినిధులు రొంగాలి పోతన్న, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

# హంస వాహనముపై స్వామి వారి తిరువీధి సేవ



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతము పై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కలికి వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవములలో భాగంగా బుధవారం ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులకు హంస వాహనంపై తిరిగి సేవా జరిగింది. ఉదయం ఆలయంలో అర్చక బృందం ఆధ్వర్యంలో నిత్య కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారిని హంస వాహనంపైన గోదాదేవి అమ్మవారిని పల్లకీలోను అధిష్టింప చేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో మంత్రపుష్పములు నిర్వహించి తిరుప్పావై లోని కనైత్తిళం కత్తెరుమై కన్రుక్కిరంగి పన్నెండవ పాశు రముతో ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు అనంతరం తీర్థ గోష్టి భక్తులందరకూ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం రాపత్తు అధ్యయన ఉత్సవములలో భాగంగా అస్థాన మండపంలో ద్రావిడ వేద ప్రబంధ పారాయణం నిర్వహించారు. అనంతరం నిత్య కార్యక్రమములు యధావిధిగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పలువురు భక్తులు పాల్గొన్నారు.




# సలార్ సినిమాతో విశాఖ వాసికి అరుదైన గౌరవం





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ నుండి చిత్రసీమ వైపు వెళ్లి తనకంటూ ఒక మంచి గుర్తింపు తెచ్చుకున్న సరిపల్లి సతీష్‌కు అరుదైన గౌరవం దక్కింది.

యూట్యూబ్ ఫాదర్‌గా అందరికీ సుపరిచితుడే. యూట్యూబ్‌లో అనేకమైన బ్లాక్ బ్లాస్టర్ వీడియోస్‌లో ఫాదర్ క్యారెక్టర్ చేసి అందరికీ దగ్గరైన నటుడు సతీష్ పర్యావరణ ప్రేమికుడిగా, ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు తనదైన శైలిలో గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సినిమాపైన మక్కువతో తొలత యూట్యూబ్‌లో అనేక వీడియోలు చేశారు. చిన్నచిన్న వేషాలు వేస్తూ సిల్వర్ స్క్రీన్లో చోటు సంపాదించుకున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ రికార్డు షేక్ చేస్తున్న డార్లింగ్ ప్రభాస్ హీరోగా నటించిన సలార్ చిత్రంలో ఒక కీలకమైన పాత్రను నటించి ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. సతీష్ సరిపల్లి ఎందరో పెద్ద స్టార్లతో చిన్నచిన్న వేషాలు వేస్తూ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. అయితే సలార్ వంటి పాన్ ఇండియా చిత్రంలో నటించిన ద్వారా మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఓ సినిమా షూటింగ్ నిమిత్తం విశాఖ విచ్చేసిన సతీష్ విలేకరులతో ముచ్చటించి విశాఖతో తనకున్న అనుబంధం, తదుపరి చిత్రాల విశేషాలను పంచుకున్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయమును ముట్టడించిన అంగన్వాడీలు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అంగన్వాడి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న ఆందోళన 16వ రోజుకి చేరింది. బుధవారం అంగన్వాడీలు పరవాడ మండలంలో దలైపాలెం వద్ద ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలపై స్పందించాలని, సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. 16 రోజులుగా మహిళలు రోడ్డుపైకొచ్చి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని, అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా, మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాల పెంపు, గ్రాట్యుయిటి అమలు కోసం పిల్లలు, గర్భిణీ, బాలింతలకు మెరుగైన సేవలు, నిధుల పెంపు కోసం గత 16 రోజులుగా అంగన్వాడి టీచర్లు, ఆయాలు, మినీలు నిరవధిక సమ్మె చేస్తున్నా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మొండిగా ఉందని ఐసిడిఎస్‌కు బడ్జెట్లో నిధులు పెంచాలని అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేయాలని గత నాలుగు సంవత్సరాలుగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం చేయలేదు. శాంతియుతంగా దశలవారీ అందోళన చేసినా ప్రభుత్వ స్పందించలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో అంగన్వాడి సెంటర్ మూసివేసి సమ్మెలోకి వెళ్లడానికి కారణం ప్రభుత్వం నిర్లక్ష్యమే. సమస్యను పరిష్కారం చేయకుండా అంగన్వాడీలపై బెదిరింపులకు దిగి అంగన్వాడి సెంటర్లను బలవంతంగా తాళాలు పగలగొట్టి ప్రభుత్వ ఆస్తులను ప్రభుత్వమే ధ్వంసం చేస్తున్నది. జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు తెలంగాణ కంటే వెయ్యి అదనంగా ఇస్తామని అమలు చేయలేదు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయలేదు నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగినా కార్మికుల జీతాలు పెంచడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదు. అంగన్వాడి న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని, లేని పక్షంలో అంగన్వాడీ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె ఐక్యంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని, దానికి రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు సిహెచ్ దేవి, జి అమ్మాజీ, వరలక్ష్మి, వెంకటి, లక్ష్మి, పార్వతి, భవాని, కనక లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పెద్దిటి ధాత్రిరెడ్డి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** పాడేరు సబ్ కలెక్టర్‌గా పి.ధాత్రిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీరించారు. ముందుగా మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ధాత్రిరెడ్డి శిక్షణ అనంతరం అనకాపల్లి జిల్లాలలో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం పాడేరు సబ్ కలెక్టర్‌గా నియమించింది. ఈ మేరకు ఇన్చార్జి సబ్ కలెక్టర్, ఐటిడి ఏపిఓ వి.అభిషేక్ నుండి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఐ.టి.డి.ఏ పి.ఓ. సబ్ కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. రెవెన్యూ అధికారులు, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి నాగరాజు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేసారు.


# 50 మందికి కళ్ళద్దాలు పంపిణీ చేసిన వెలగపూడి, ఒమ్మి



**అరిలోవ, (విశాఖ సమాచారమ్):** ఎన్‌టీఆర్ సేవాసమితి, గీతం హాస్పటిల్ వారి అధ్వర్యంలో, 12వ వార్డు తోటగరువు కార్యాలయం వద్ద సుమారు 50 మందికి ఉచితంగా కళ్లద్దాలు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి సన్యాసిరావు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ గీతం హాస్పటల్‌వారు పేదలకు చేస్తున్న వైద్య సేవలను కొనియాడారు.

అలాగే చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని దానివలన రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని చంద్రబాబు నాయుడు ని ముఖ్య మంత్రిని చేసే వరకు మన మందరం కష్టపడాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ ఒమ్మి అప్పల రాజు, వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 11వ వార్డు ఇంఛార్జి రాగతి అచ్యుత రావు, అధ్యక్షుడు, ముగడ రాజారావు, పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్, పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి పోలా రావు, పార్లమెంట్ పార్టీ సెక్రటరీలు, ఏడువాక సన్యాసిరావు, మూది అప్పారావు, ఎం.కృష్ణంరాజు, భరత్, పేపర్ నాయుడు, దువ్వి తాతారావు విజయ, ఇల్లా లక్ష్మిగోపాల్, కొండమ్మ, లలిత, గణపతి, రామకృష్ణ, కాయిత గోవింద్, యాత్రాజి తదితరులు పాల్గొన్నారు.






VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Pardwada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676